ప్రజాశక్తి

ఆదివారం 16 జులై 2023 8 పేజీలు



గుంటూరు



పల్నాడు

లక్ష్యం ఘనం - ఆచరణ పరిమితం

- ఆదాయ, కుల ధృవీకరణ పత్రాల జారీకే ప్రాధాన్యం
- నివాసితుల బయోమెట్రిక్‌తో సరి
- కుటుంబ మ్యాపింగ్ మార్పులు, బియ్యం కార్డులజారీ వాయిదా

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

అర్హత ఉండి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందని వారికి తిరిగి పథకాలు అందించాలన్న లక్ష్యంతో రూపొందించిన సురక్ష పథకం ఆచరణలో అందుకు భిన్నంగా సాగుతోంది. అధికారులు, వాలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు క్షేత్రస్థాయిలో ప్రజల వద్దకు వెళ్లి వివరాలు తెలుసుకుని అర్హత కలిగిన వారు మిగిలిపోతే వారికి తిరిగి అవకాశం కల్పించాల్సిఉంది. అయితే ఆచరణలో వాలంటీర్లు, సచివాలయాల ఉద్యోగులు తగిన శ్రద్ధ కనబర్చలేదు. కేవలం బియ్యం కార్డు దారులు ఉన్నారా లేదా తెలుసుకోవడం, ఉంటేవారి నుంచి బయోమెట్రిక్ లేదా ఐరీష్ నమోదు చేయడం, ఆదాయ, కుల ధ్రువీకరణపత్రాలకు దరఖాస్తులు ఇస్తే తీసుకోవడం తప్ప ప్రభుత్వ మార్గదర్శకాలను ప్రజలకు వివరించడం, అందుకు అనుగుణంగా పనిచేయడం, పథకాలు అందని వారికి ఆయా అంశాల్లో ఉన్న ఇబ్బందులపై మినహాయింపు చర్యలు చేపట్టడం చాలా మొక్కుబడిగా సాగుతోంది. ఇంట్లో కుటుంబసభ్యులు ఎవరైనా మరణిస్తే అవసరమయ్యే ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్, ఆస్తుల బదలాయింపు, విక్రయాల ద్వారా పేర్లు మార్పు, బియ్యంకార్డుల జారీ, ప్రజాసాధికార సర్వేలో జరిగిన కుటుంబసభ్యుల మ్యాపింగ్, కౌలు రైతులకు సిసిఆర్‌సి కార్డులు తదితర అంశాలపై దృష్టి సారించలేదు. బియ్యం కార్డులు, పింఛన్ల



తాడికొండలో ధ్రువీకరణ ప త్రాలు ఇస్తున్న కత్తెర సురేష్

పునరుద్ధరించాలని ఉమ్మడి జిల్లాలో దాదాపు లక్ష కుటుంబాల వారు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. జిల్లాలో ఈనెల 24 నుంచి ప్రారంభం అయిన జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా తమకు మేలు జరుగుతుందని భావించినా చాలామంది నిరాశకు గురవుతున్నారు. ఇప్పటికి సచివాలయాలు, మండల కార్యాలయాల చుట్టూ తిరుగుతూనే ఉన్నారు. సురక్ష కార్యక్రమం ద్వారా కుటుంబ మ్యాపింగ్ విభజనకు అవకాశం కల్పిస్తామని చెప్పినా ఆచరణలో అందుకు పలు ఆంక్షలు విధించారు. సచివాలయాల ద్వారా 11 రకాల ధృవీకరణ పత్రాలు అందచేస్తామని ప్రకటించారు. వీటిల్లో గత మూడు వారాల్లో కుల, ఆదాయ, పుట్టిన, మరణించిన, నివాస ధృవీకరణ పత్రాలు ఇచ్చేందుకు మాత్రమే ప్రాధాన్యత ఇచ్చారు. ఇందుకు సంబంధించి గుంటూరు, పల్నాడు జిల్లాల్లో కలిపి లక్ష వరకు దరఖాస్తులు వచ్చాయి. స్థలాలు, పొలాలకు మ్యూటేషన్ ఫర్ ట్రాన్సాక్షన్, కౌలు రైతులకు గుర్తింపు కార్డులు, ఈడబ్ల్యూఎస్, ఆధార్ కార్డులకు అప్‌డేట్ వంటి సేవలు స్వల్పంగా జరుగుతున్నాయి. వాలంటీర్లు స్థానికంగా ఉండకుండా కేవలం ఒకటో తేదీన సామాజిక పింఛన్లు పంపిణీకి పరిమితం అయి ప్రజలకు అందుబాటులో ఉండటం లేదని అందువల్ల ప్రభుత్వ సేవల్లో

2 లో



పెదనందిపాడు బంద్ సందర్భంగా ప్రదర్శన నిర్వహిస్తున్న అఖిలపక్షం నాయకులు

పెదనందిపాడు బంద్ సంపూర్ణం

గుంటూరు ఛానల్ కోసం స్వచ్ఛందంగా షాపులు, కళాశాలలు మూత - నిర్మానుష్యంగా రోడ్లు

ప్రజాశక్తి - పెదనందిపాడు రూరల్

గుంటూరు ఛానల్‌ని పర్చూరు వరకు పొడిగించి వెంటనే నిధులు విడుదల చేసి పనులు ప్రారంభించాలని, గుంటూరు కలెక్టరేట్ వద్ద జరుగుతున్న దీక్షలకు సంఘీభావంగా పెదనందిపాడులో అఖిలపక్ష కమిటీ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన బంద్ విజయవంతమైంది. పెదనందిపాడు లోని అన్ని వ్యాపార సంస్థలు, దుకాణాలు, ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలలు పాఠశాలలు ప్రభుత్వ కార్యాలయాలు మూతపడ్డాయి. ఈ సందర్భంగా అఖిలపక్ష నాయకులు అన్ని వీధుల్లో ప్రదర్శన నిర్వహించి ప్రభుత్వ బ్యాంకులను, రెవెన్యూ కార్యాలయాలను మూసి వేయించారు. ఈ సందర్భంగా జరిగిన సభకు అఖిలపక్ష కమిటీ



బంద్ సందర్భంగా ఎస్‌బిఐని మూసివేయిస్తున్న అఖిలపక్ష నాయకులు

నాయకులు కాకుమాను నాగేశ్వరరావు అధ్యక్షతన సభ నిర్వహించారు. సిపిఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు మాట్లాడుతూ ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి నిధులు కేటాయించి దీక్షలను విరమింప చేయాలని కోరారు. ఏళ్ల తరబడి ఉద్యమాలు చేస్తున్నా ప్రభుత్వాలు ప్రజల గోడును పట్టించుకోకపోవడం దుర్మార్గమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వెంటనే నిధులు విడుదల చేసి

2లో

కౌలు రైతులందరికీ గుర్తింపు కార్డులివ్వాలి

కౌలు రైతు సంఘం పల్నాడు జిల్లా అధ్యక్ష,కార్యదర్శులు కె రామారావు, వై రాధాకృష్ణ డిమాండ్

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా

కౌలు రైతు గుర్తింపు కార్డుల మంజూరులో లక్ష్యం కాకుండా ఎంతమంది కౌలు రైతులు ఉంటే అంతమందికి గుర్తింపు (సిసిఆర్‌సి) కార్డులు ఇవ్వాలని ఏపీ కౌలు రైతు సంఘం పల్నాడు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కామినేని రామారావు, వై రాధాకృష్ణ డిమాండ్ చేశారు. శనివారం పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేట కోటప్పకొండ రోడ్డులో గల పల్నాడు విజ్ఞాన కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. పల్నాడు జిల్లాలో 1.50 లక్షల మందికి పైగా కౌలు రైతులు ఉంటే 2023-24 ఏడాదికి 50 వేల గుర్తింపు కార్డులు లక్ష్యం విధించడం సరికాదన్నారు. గత ఏడాది అసలు కౌలు రైతులకు కాకుండా అధికార పార్టీకి చెందిన వారికి కౌలు రైతు గుర్తింపు కార్డులు మంజూరు చేసిన ఘటనలు వెలుగులోకి వచ్చిన విషయాన్ని అధికారులు పరిశీలించాలన్నారు. నిజమైన కౌలు రైతులను గుర్తించి సి.సి ఆర్ సి కార్డులు మంజూరు చేయాలన్నారు. ప్రస్తుతం సాగుదారులలో కౌలు రైతులు ఎక్కువగా ఉన్న నేపథ్యంలో ప్రతి కౌలు రైతుకి గుర్తింపు కార్డు ఇవ్వాలని డిమాండ్ చేశారు. గ్రామ సభలు నిర్వహించి నిజమైన కౌలు రైతులను గుర్తించాలని, లబ్ధిదారుల జాబితాలను సచివాలయాలలో రైతు భరోసా కేంద్రాలలో ప్రదర్శించాలన్నారు. ప్రస్తుతం జగనన్న సురక్ష కార్యక్రమంలో కౌలు రైతుల దరఖాస్తులను పరిశీలించి కార్డులు మంజూరు చేయడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. అవగాహన లేమితో దరఖాస్తు చేసుకోని రైతులను వాలంటీర్లు, సచివాలయ సిబ్బంది గుర్తించి కార్డులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. సిసిఆర్సి కార్డు పొందలేని కౌలు రైతుల పంటలకు కూడా పంటల బీమా నమోదు చేయాలన్నారు. కార్డులు పొందిన రైతులకు బ్యాంకుల ద్వారా రుణాలు మరియు సొంత భూమిలేని కౌలు రైతులందరికీ రైతు భరోసా ఇవ్వాలన్నారు. 2010లో ఏర్పాటు చేసిన జాయింట్ లైబిలిటీ గ్రూపుల ద్వారా రుణాలు తీసుకొని ప్రతి ఏడాది తిరిగి చెల్లిస్తున్న కౌలు రైతులకు ఈ ఏడాది బ్యాంకు



మాట్లాడుతున్న రాధాకృష్ణ, కె రామారావు

2లో

రాజీఫార్ములాతో మొక్కుబడిగా డిఆర్‌సి...

వీక్షణం

8 లో



మాట్లాడుతున్న హరిబాబు

25 వేల ఎకరాల సాగు పట్టదా

హైలెవల్ ఛానెల్ రైతుల సమావేశంలో కృష్ణయ్య ఆగ్రహం

కన్వీనింగ్ కమిటీ ఏర్పాటు

(వార్త మెయిన్ పేజీలో)

26 కల్తీ ఆహార కేసులు నమోదు

రూ.3.20 లక్షలు జరిమానా

కల్తీ ఆహార పదార్థాలను వినియోగిస్తే చర్యలు

పల్నాడు జిల్లా జెసి శ్యామ్ ప్రసాద్

2లో



11కిలోల గంజాయి స్వాధీనం

ఇద్దరు అంతరాష్ట్ర నిందితుల అరెస్టు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరునల్లపాడు పోలీసుస్టేషన్ పరిధిలో పశ్చిమ బెంగాల్‌కు చెందిన ఇద్దరు నిందితులను అరెస్టు చేసి వారి వద్దనుంచి 11 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు జిల్లా ఎస్‌పి ఆరీఫ్ హఫీజ్ తెలిపారు. శనివారం రాత్రి ఆయన తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియాసమావేశంలో మాట్లాడారు. బెంగాల్‌కు చెందిన ప్రతాప చంద్ర సాహూ (30) గుంటూరు జూట్ మిల్లు పక్కన శివాలయం రోడ్డులో నివశిస్తున్నాడు. మరోనిందితుడు జహరుద్దీన్ గాజీ (34) సాకేత్ పురంలోఉంటున్నారడు.వీరిద్దరు చెడువ్యసనాలకు బానిసలు అయి తక్కువ సమయంలో ఎక్కువ సంపాదించవచ్చునన్న భావనతో ఒరిస్సానుంచి గంజాయి తెచ్చి గుంటూరులో విక్రయిస్తున్నారు. తొలుత ప్రతాపచంద్ర సాహూ ఒరిస్సాలోని బరంపురం, మల్కన్‌గిరి ప్రాంతాల నుంచి గంజాయి తెచ్చి ఆటో డ్రైవర్లకు, కూలీలకు,కాలేజి విద్యార్థులకు విక్రయిస్తుండగా తరువాత జహరుద్దీన్ పరిచయడం అయ్యాడు. దీంతోకొంత గంజాయిని సాహూ జహర్దుదీన్‌కు ఇచ్చి అమ్మిస్తున్నాడు.వీరి కదలికలపై నిఘా వేసిన నల్లపాడు పోలీసులు గంజాయి విక్రయాలు చేస్తున్నట్టు గుర్తించారు. శనివారం వీరిద్దరిని అరెస్టు చేశారని ఎస్‌పి తెలిపారు. చంద్రసాహూ వద్ద 9 కిలోలు, జహరుద్దీన్ వద్ద రెండు కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్టు చెప్పారు. డిఎస్‌పి మహబూబ్ భాషా ఆధ్వర్యంలో నల్లపాడు సి.ఐ. బత్తుల శ్రీనివాసరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కౌలు రైతులందరికీ గుర్తింపు కార్డులివ్వాలి

(మొదటిపేజీ తరువాయి)

అధికారులు ఒకే సర్వేనెంకు రెండు సార్లు రుణాలు ఇవ్వమని కౌలు రైతులకు మొండి చేయి చూపిస్తున్నారన్నారు. భూ యజమాని సాగు చేయకుండానే ముందుగానే బ్యాంకుల వద్ద అవే సర్వే నంబర్ల మీద రుణాలు తీసుకుంటున్నారని అదే సర్వే నెంబర్ మీద రుణాలు కౌలు రైతులకు ఇవ్వమని చెబుతున్నా రన్నారు. 2019 కౌలు రైతుల చట్టం వచ్చిన తరువాత కౌలురైతులకు ఇచ్చిన రుణాలు చాలా తక్కువన్నారు. గతంలో కౌలు రైతులు గ్రూపులుగా ఏర్పడి తీసుకున్న రుణాలు చెల్లిస్తూ తిరిగి తీసుకుంటున్నవే ఎక్కువగా ఉన్నాయని వారికి కూడా బ్యాంకులు రుణాలు ఇవ్వటానికి నిరాకరిస్తున్నాయన్నారు. భూమిలేని కౌలు రైతుల రైతు భరోసా లబ్ధిదారుల లిస్టులను గ్రామ సచివాలయంలో ప్రకటించాలని గతంలో జిల్లాలో జరిగిన అవకతవకలు జరగకుండా ఉండేందుకు అధికారులు పారదర్శకంగా వ్యవహరించా లన్నారు. పంటల పెట్టుబడి సహాయం (రైతు భరోసా) కౌలు రైతులకు రూ 25 వేలు ఇవ్వాలన్నారు. కౌలు రైతులను వ్యవసాయ శాఖ అధికారులు జాయింట్ లైబిలిటీ గ్రూపులుగా ఏర్పాటు చేసి బ్యాంకుల ద్వారా రుణాలు ఇప్పించాలన్నారు. ఆగస్టు 1 నుండి 10 వరకు కౌలు రైతులకు పంట రుణమేళాలను ఏర్పాటు చేయాలని భూ యజమాని రుణంతో ప్రమేయం లేకుండా ప్రతి కౌలు రైతుకు పంట హామీపై రూ 1.60 లక్షల వరకు స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం రుణాలు ఇవ్వాలన్నారు. కౌలు రైతుల సమస్యలను నిర్లక్ష్యం చేస్తే కౌలు రైతుల సంఘం ఆధ్వర్యంలో పోరాటం చేస్తామని హెచ్చరించారు.



ఎంపి సురేష్ కుమార్ కు వినతి పత్రం ఇస్తున్న బుడగ జంగాల నాయకులు

కులధ్రువీకరణ పత్రం ఇప్పించండి

ఎంపి నందిగం సురేష్‌కు రాష్ట్ర బుడగ జంగాలు వినతి

ప్రజాశక్తి - తుళ్లూరు

తమకు ప్రభుత్వం కుల ధ్రువీకరణ పత్రం మంజూరు చేసేలా కృషి చేయాలని బాపట్ల ఎంపి నందిగం సురేష్ కు రాష్ట్ర బుడగ జంగాల అధ్యక్షులు యలమర్తి మధు విజ్ఞప్తి చేశారు. శనివారం కొంతమంది బుడగ జంగాల నాయకులను వెంట బెట్టుకొని ఉద్దండరాయునిపాలెం లో ఎంపి ని కలిశారు. ఈ సందర్భంగా మధు మాట్లాడుతూ స్వతంత్రం వచ్చిన నాటి నుంచి బుడగ జంగాలకు కుల ధ్రువీకరణ పత్రం మంజూరు చేయక పోవడం వల్ల ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందడం లేదని ఎంపి దృష్టికి తీసుకొచ్చారు. ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్ళి బుడగు జంగాల సామాజిక వర్గానికి న్యాయం జరిగేలా చూస్తామని ఎంపి సురేష్ వారికి హామీ ఇచ్చారు.

ప్రజాసమస్యలకు కేంద్ర బిందువు

తుళ్లూరులో సిపిఐ కార్యాలయం ప్రారంభించిన జంగాల అజయ్ కుమార్

ప్రజాశక్తి - తుళ్లూరు



కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న జంగాల

రాజధాని అమరావతి ప్రాంతం తుళ్లూరులో సిపిఐ కార్యాలయాన్ని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్ కుమార్ శనివారం ప్రారంభించారు .అనంతరం జరిగిన సభలో ఆయన మాటాడుతూ, రాజధాని అమరావతి ప్రాంతంలో సిపిఐ కార్యాలయం ప్రజాసమస్యల పరిష్కారానికి కేంద్ర బిందువుగా విరాజిల్లాలని ఆకాంక్షించారు. ప్రజాసమస్యలు, అమరావతి సాధనకు జరిగే పోరాటాలకు కార్యాలయం కేంద్రంగా ఉంటుందన్నారు. అమరావతే రాజధానని అసెంబ్లీలో ప్రకటించి అధికారంలోకి వచ్చాక మూడు రాజధానుల పేరుతో రాష్ట్రానికి రాజధాని లేని దౌర్భాగ్య పరిస్థితిని జగన్ మోహన్ రెడ్డి కల్పిం చారన్నారు. మైనింగ్, ఇసుక, మద్యం సొమ్ము జగన్ మోహన్ రెడ్డికి, గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో తిట్లు మాత్రం మంత్రులు, ఎమ్మెల్యే లకని ఎద్దేవా చేశారు. దేశ, రాష్ట్ర ఆర్థిక పరిస్థితులను మోడీ, జగన్ దివాలా తీయించారని మండిపడ్డారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కె వి వి ప్రసాద్ మాట్లాడుతూదేశం అన్ని రంగాల్లో తిరోగమనం వైపు పయనిస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సిపిఐ నియోజక వర్గ కార్యదర్శి ముప్పాళ్ళ శివ శంకరరావు,జి వి రాజు,చిన్ని తిరుపతయ్య,కోటా మాల్యాద్రి పాల్గొన్నారు.

పెదనందిపాడు బంద్ సంపూర్ణం

(మొదటిపేజీ తరువాయి)

పనులు ప్రారంభించాలని ఆయన డిమాండ్ చేశారు. తెలుగుదేశం పార్టీ నాయకులు నర్రా బాలకష్ణ మాట్లాడుతూ కేవలం 300 కోట్ల రూపాయల తోటి పూర్తయ్య ప్రాజెక్టు కొరకు ప్రజల్ని ఈ విధంగా ఇబ్బందులు గురి చేయటం సబాబు కాదన్నారు. తెలుగుదేశం పార్టీగా అన్ని రాజకీయ పక్షాలను కలుపుకొని నిదులు కేటాయించే వరకు పోరాడుతామన్నారు .కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు లావు అంకమ్మ చౌదరి మాట్లాడుతూ స్వాతంత్ర పోరాటంలో ప్రముఖు ప్రముఖ పాత్ర వహించినటువంటి పెదనందిపాడు నిరాకరణ ఉద్యమం లాంటి ఉద్యమాన్ని ప్రభుత్వం చూడబోతుంది అన్నారు. ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కంచు మాటి అజయ్ కుమార్ మాట్లాడుతూ అన్ని రైతు సంఘాలను కలుపుకొని గుంటూరు ఛానల్ కి నిధులు సాధించేవరకు ఐక్యంగా పోరాడుతామన్నారు. నల్లమడ రైతు సంఘం నాయకులు కొల్లా రామన్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఇచ్చిన వాగ్దానాన్ని వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేశారు .ఈ బంద్ సందర్భంగా జరిగిన సభను ఉద్దేశించి గుంటూరు ఛానల్ సాధన సమితి నాయకులు కుర్రా హరిబాబు మాట్లాడుతూ ఐక్య పోరాటాల ద్వారా వ్యవసాయ చట్టాలను కేంద్ర ప్రభుత్వం నిర్మించుకోవాల్సి వచ్చింది అన్నారు. తెలుగు రైతు పార్లమెంటరీ పార్టీ అధ్యక్షులు మోపర్తి చెంచయ్య సర్పంచుల సంఘం జిల్లా అధ్యక్షులు కల్లూరి శ్రీనివాసరావు. నల్లమడ రైతు సంఘం నాయకులు మహబూబ్ బాషా .ఏపీ కౌలు రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కొత్త శివ నాగేశ్వరరావు. నల్లమడ రైతు సంఘం నాయకులు కొల్లా నిర్మల, తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు విక్రయాల సుబ్బారావు, తదితరులు మాట్లాడారు ఈ కార్యక్రమంలో అఖిలపక్ష నాయకులు చాగంటి సత్యహర్ష, ఏపీ రైతు సంఘం బాపట్ల జిల్లా కార్యదర్శి రామారావు ,కాపు వెంకట సుబ్బారావు ,మద్దూరి రమణ, పోపూరి నాగేశ్వరరావు ,నూతి శ్రీను, చుక్క యానాదులు, షేక్ సలీం, బండి శంకరయ్య ,గొల్లపూడి శ్రీనివాసరావు ,కె.ప్రసాద్ ,బాబు,దేవరకొండ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



నిర్మానుష్యంగా పెదనందిపాడు మెయిన్ రోడ్డు

లక్ష్యం ఘనం - ఆచరణ పరిమితం

(మొదటిపేజీ తరువాయి)

మందగమనం పెరిగిందని విమర్శల నేపథ్యంలో సురక్ష ద్వారా వాలంటీర్లు ప్రతి ఇంటిని సందర్శించాలని లక్ష్యంగా నిర్ణయించారు.ఇందులో భాగంగా జిల్లాలో వాలంటీర్లు సురక్ష సర్వేలో 99శాతం మందిపాల్గొన్నట్టు అధికారులు తెలిపారు. ఇంటింటి సర్వే 80 శాతం జరిగినట్టు అధికారులు చెప్పారు. జిల్లాలో ఇప్పటి వరకు లక్ష ధృవీకరణపత్రాలకు దరఖాస్తులు అందాయని, వీటిల్లో 50 శాతం జారీచేశామని అధికారులు చెప్పారు. సురక్ష సభలు గ్రామ,వార్డు సచివాలయం స్థాయిలో జరుగుతున్నాయి.వీటిల్లో ధృవపత్రాల పంపిణీ జరుగుతోంది. ఈనెల 23వరకు కార్యక్రమం కొనసాగుతుందని, అప్పటికి పూర్తి స్థాయిలో ప్రజల నుంచివచ్చిన దరఖాస్తులస్వీకరణ, తిరస్కరణ నిర్ధారణ అవుతుందని చెబుతున్నారు.

జగనన్న సురక్ష అమలు తీరు తనిఖీ

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా

శనివారం జిల్లా కలెక్టర్ శివ శంకర్ లోతేటి నరసరావుపేట పట్టణంలోని రామిరెడ్డి పేట, పాత సమితి ఆఫీస్, 23 వ వార్డు, ప్రశాంతి నగర్-2 సచివాలయ పరిధిలో జగనన్న సురక్ష పథకం అమలు తీరును ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సచివాలయ సిబ్బంది వాలంటీర్లతో పలు అంశాలపై చర్చించి ప్రజలకు అందిస్తున్న సేవలను అడిగి తెలుసుకొన్నారు. కొత్తూరి సరళ మరియు చీమకుర్తి జయనాబి తదితరులు తెలిపిన పలు సమస్యలను అవసరమైన జగన్న తోడు మరియు ముఖ్య మంత్రి సహాయ నిధికి సంబంధించి చర్యలు తీసుకోవలసినదిగా సంబంధిత అధికారులను ఆదేశించారు. కుల ధ్రువీకరణకై 115, ఆదాయ ధ్రువీకరణకై 97 లతో పాటు తదితర సమస్యల పరిష్కారానికి మొత్తం కలిపి 249 దరఖాస్తులు వచ్చాయని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ ఎం. శేషిరెడ్డి, కమిషనర్ రామ్ మోహన్, తహశీల్దార్ రమణ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

సంస్కృతి, సాంప్రదాయాలు యవతకు తెలియాలి : కలెక్టర్

ప్రజాశక్తి - పల్నాడుజిల్లా



తెలుగు సంస్కృతీ, సంప్రదాయాలను నేటి యువతకు తెలియ చెప్పేందుకు పల్నాడు జిల్లాలో ప్రతి నెల 3వ శనివారం నెల నెల సాహిత్యం కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని ఇప్పటికి మూడు సార్లు ఈ కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందని, నేడు 4వ కార్యక్రమం నిర్వహిస్తున్నామని జిల్లా కలెక్టర్ శివ శంకర్ లోతేటి తెలిపారు. శనివారం స్థానిక నరసరాపేటలోని భువన చంద్ర టౌన్ హాలు లో " నెల నెల సాహిత్య మేళా " తెలుగు భాషా సమాలోచన కార్యక్రమానికి ముఖ్య అతిదిగా జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు. జ్యోతి ప్రజ్వలన, ప్రార్ధనగీతం అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ 13 వ శతాబ్దపు కవి బ్రహ్మ తిక్కన సోమయాజి సాహిత్య, సామాజిక అంశము లపై చర్చించడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా పలు ప్రశ్నలు పిల్లలకు వేసి వారినుండి సమాధానాలు రాబట్టారు. ఈ సందర్భంగా 3 చేపల కథను వివరించి ద్రౌపది కౌరవ సభలో ఆలపించిన గద్యాన్ని అర్ధముతో సహా వివరించారు. కార్యక్రమానికి పి.వ.యస్.ఆర్ ప్రసాద్ ప్రధాన ఉపన్యాసకులుగా వ్యవహరించి ప్రసంగించారు. ఈ సందర్భంగా ఎపిపిజిసెట్ (ఎం.ఎ తెలుగు) లో రాష్ట్ర స్థాయిలో 6 వ ర్యాంక్ సాధించిన షేక్.అమీరున్నిసా బేగంను శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా రెవిన్యు అధికారి వినాయకం, జిల్లా విద్యా శాఖాధికారి సామ్యూల్, సాంఘీక సంక్షేమ సాఖదికారి ఓబుల్ నాయుడు,వక్తలు డా.రాదా కష్ణమూర్తి, మస్తాన్ రెడ్డి, రామిరెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్ధిని విద్యార్ధులు తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమ అనంతరము వక్తలను సముచిత రీతిలో సత్కరించారు. వచ్చే నెల 19న కవి గురజాడ అప్పారావు పై సాహిత్య మేళ ఉంటుందని జిల్లా కలెక్టర్ తెలిపారు

బెల్ట్ షాప్ నిర్వాహకుడు అరెస్ట్

ప్రజాశక్తి తెనాలి

అనధికారికంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని స్పెషల్ ఎంఫోర్స్మెంట్ బ్యూరో(ఎస్ఈబి) అధికారులు అరెస్ట్ చేశారు. ఎస్ఈబి సిఐ ఏవి చలం వెల్లడించిన వివరాల ప్రకారం ప్రత్యేకంగా నిర్వహించిన దాడుల్లో రూరల్ గ్రామం సోమ సుందరపాలెం లో అనధికారికంగా మద్యం విక్రయిస్తున్న లుక్క వెంకటేశ్వర్లు అలియాస్ జపాన్ ను అదుపులోకి తీసుకున్నారు. అతని నుంచి35 మద్యం బాటిల్స్ స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరిచినట్లు తెలిపారు

అనధికార ఇసుక నిల్వపై కేసు నమోదు

ప్రజాశక్తి తెనాలి

అనధికారికంగా ఇసుక నిల్వచేసిన వ్యక్తిపై స్పెషల్ ఎంఫోర్స్మెంట్ బ్యూరో అధికారులు కేసు నమోదు చేశారు. సీఐ ఏవి చలం వెల్లడించిన వివరాల ప్రకారం రూరల్ గ్రామం కాజీపేటలో 125 టన్నుల ఇసుక నిల్వలు ఉన్నట్లు అందిన సమాచారంతో శనివారం దాడి చేశారు. గ్రామానికి చెందిన చెక్క రామాంజనేయులను అదుపులోకి తీసుకుని, కేసు నమోదు చేసి రూరల్ పోలీసులకు అప్పగించారు. అతను నిల్వ ఉంచిన 125 టన్నుల ఇసుకతో పాటు ట్రాక్టర్ల సీజ్ చేశారు.

నల్గురు వ్యక్తులపై పిడి యాక్టు

రాజమండ్రి జైలుకు నిందితులు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

చట్టవ్యతిరేక కార్యకలాపాలకుపాల్పడుతున్న నల్గురు వ్యక్తులపై పిడి యాక్టు అమలు చేస్తున్నట్టు జిల్లా ఎస్‌పి ఆరీఫ్ హఫీజ్ శనివారం రాత్రి మీడియాకు తెలిపారు. పల్నాడు జిల్లా నర్సరావుపేటకు చెందిన షేక్ సైదా వలి, షేక్ మస్తాన్, గుంటూరు నల్లచెరువుకు చెందిన షేక్ గౌస్‌భాష, గుంటూరు దర్గామాన్యం ప్రాంతానికి చెందిన షేక్ ముస్తాకిన్‌లను అరెస్టు చేసి పిడి యాక్టు అమలు చేస్తున్నట్టు తెలిపారు. వీరిని అరెస్టు చేసి రాజమండ్రి జైలుకు పంపారు. 2019లో నమోదు అయిన పలు కేసుల్లో వీరునల్గురు నిందితులుగాఉన్నారు. తాజాగా 2023లోకూడా వీరికి వ్యతిరేకంగా నల్లపాడు పోలీసులు పలు కేసులు నమోదు చేశారు.

26 కల్తీ ఆహార కేసులు నమోదు

రూ.3.20 లక్షలు జరిమానా

కల్తీ ఆహార పదార్థాలను వినియోగిస్తే చర్యలు

పల్నాడు జిల్లా జెసి శ్యామ్ ప్రసాద్

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా

జిల్లాలో కల్తీ ఆహార సరఫరా, తయారు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని జిల్లా జాయింట్ కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ హెచ్చరించారు. జిల్లా జాయింట్ కలెక్టర్ ఆదేశాలు మేరకు నరసరావుపేట పరిధిలోని పలు హోటళ్ళు, కిరాణా దుకాణాలు, వంట నూనె తయారీ మిల్లులు, బేకరీలు, వాడిన నూనెలను వినియోగిస్తున్న హోటళ్ళ పై ఆహారతనిఖీ అధికారులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 26 మందిపై కేసులు నమోదు చేసి, అక్కడ తీసిన నమూనాలను హైదరాబాద్ నాచారం ఆహార భద్రత కార్యాలయానికి పంపగా, అక్కడ నుంచి వచ్చిన ఫలితాల మేరకు కేసులు నమోదు చేసినట్లు జిల్లా జాయింట్ కలెక్టర్ వెల్లడించారు. కేసులు నమోదు చేసిన వారి నుంచి రూ.3.20 లక్షల అపరాధ రుసుము చెల్లించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఆదేశించారు. భవిష్యత్తులో ఇదే తరహాలో మోసాలకు పాల్పడితే మరింత కఠినమైన చర్యలు తీసుకుంటామని జిల్లా జాయింట్ కలెక్టర్ హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా ఆహార తనిఖీ అధికారులు సీ.హెచ్ లక్ష్మీ నారాయణ, ఎన్. వేంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి
గుంటూరు, పల్నాడు
3
ఆదివారం 16 జులై 2023

ఆఖరి మజిలీకి చోటులేదా?

ప్రజాశక్తి-తాడేపల్లి

తాడేపల్లి పట్టణం దినాదినాభివృద్ధి చెందుతుంది. బైపాస్‌రోడ్డులో అపార్టుమెంట్ల సంస్కృతి పెరిగిన తరువాత సుమారు లక్ష మంది జనాభా ఇక్కడ నివాసిస్తున్నారు. విజయవాడ నగరానికి కూతవేటు దూరంలో ఉంది. ఇంత అభివృద్ధి చెందుదున్న తాడేపల్లి మనిషి చనిపోతే అంతిమ సంస్కారాలు నిర్వహించడానికి ఆఖరి మజిలీకి స్థలం లేదా... అంటే అవుననే సమాధానం వస్తుంది. తాడేపల్లి గర్భంలో మున్సిపల్ కార్పొరేషన్ అయిన తరువాత నాలుగు వార్డుల పరిధిలో ఉన్న జనం తమ బంధువుల ఎవరైనా చనిపోతే అమరారెడ్డినగర్‌లో ఉన్న రోడ్డు పక్కన రెండు సెంట్ల స్థలంలోనే దహన సంస్కారాలు నిర్వహించాల్సి వస్తుంది. క్రిష్టియన్ సంప్రదాయం ప్రకారం అయితే అదే ప్రాంతంలో కాలువ ఒడ్డున కట్ట మీద పూడ్చి పెట్టి దహన సంస్కారాలు నిర్వహిస్తున్నారు. ఇక్కడ సుమారు ఎనిమిది ఎకరాల స్థలం ఉన్నా చనిపోయి పూడ్చిపెట్టిన మృతదేహాల కిందే మళ్లీ గోతులు తవ్వి పూడ్చి పెట్టాల్సిన పరిస్థితి నెలకొంది. క్రిష్టియన్ పేట ప్రాంతంలో దళితులైతే ప్రాతూరు సమీపంలోని కరకట్ట ప్రాంతంలో దహన సంస్కారాలు నిర్వహిస్తున్నారు. సుందరయ్య నగర్, మహానాడు ప్రాంతాల్లో కృష్ణానదిలోనే అంతిమ సంస్కారాలు నిర్వహిస్తున్నారు. కృష్ణానదికి నీరు, వరద వచ్చినప్పుడు ఈ ప్రాంతంలో అంతిమ సంస్కారాలకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కృష్ణనగర్ ప్రాంతంలో అయితే పాత పంచాయతీ కార్యాలయం సమీపంలో అంతిమ సంస్కారాలు అతి కష్టం మీద నిర్వహిస్తున్నారు. తాడేపల్లి బైపాస్‌రోడ్డు నిర్మాణం అయిన తరువాత అనేక మంది కోట్లకు పడగలెత్తిన అసాములు ఇక్కడ ఉన్నారు. అయితే అంతిమ సంస్కారం నిర్వహించడానికి ఆహ్లాదకరమైన వాతావరణంలో ఒక శ్మశాన వాటికను నిర్మించుకోలేకపోవడం బాధాకరం. సాక్షాత్తు ముఖ్యమంత్రి నివాసం ఉండే ప్రాంతంలో కాలువ ఇవతల పక్కన కొద్దిపాటి స్థలంలోనే రోడ్డు పక్కన అంతిమ సంస్కారాలు నిర్వహిస్తున్నారు. దీంతో రోడ్డు పక్కన వెళ్లే వారు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. దహన సంస్కారాలు నిర్వహించే సమయంలో అటువైపు వెళ్లే పాఠశాల బస్సుల్లోని పిల్లలు భయాందోళనకు గురవుతున్నారు. సంప్రదాయం ప్రకారం దహన సంస్కారాలు నిర్వహించుకునే వారికి రోడ్డు పక్కనే చేయాల్సిన పరిస్థితి రావడంతో అసౌకర్యానికి గురవుతున్నారు. గతంలో సిపిఎం అధికారంలో ఉన్న సమయంలో అంతిమ సంస్కారాలు నిర్వహించడానికి పెద్దఎత్తున గ్రీనరీతో పాటు షెడ్డు నిర్మించడానికి ప్రయత్నం చేశారు. ఆనాడు అధికారంలో ఉన్న కాంగ్రెస్ ఒక వర్గాన్ని రెచ్చగొట్టి శ్మశాన నిర్మాణం పనులను నిలుపుదల చేయించింది. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఎవరూ శ్మశాన వాటిక గురించి



పట్టించుకోలేదు. మంగళగిరి తాడేపల్లి నగర కార్పొరేషన్ రాష్ట్రంలోనే రెండో స్థానంలో ఉంది. ఇటువంటి చోట అంతిమ సంస్కారం నిర్వహించడానికి సరైన వసతులు లేకపోవడం పట్ల పట్టణ జనాభా అసంతృప్తి వ్యక్తం చేస్తుంది. ప్రస్తుతం ఉన్న శ్మశానం దగ్గర అంతిమ సంస్కారాలు నిర్వహించిన తరువాత కాళ్లు చేతులు శుభ్రం చేసుకోవడానికి బోరింగ్ పంపు సౌకర్యం కూడా లేదు. కిలోమీటలరు దూరం నడిచి వచ్చి బకింగ్ హెూమ్ కెనాల్ వద్ద దాతల ద్వారా ట్యాంకుల ద్వారా ఏర్పాటు చేసిన నీటిని వాడాల్సి వస్తుంది. ఉండవల్లి, పెనుమాక, కొలనుకొండ తదితర గ్రామాల్లో శ్మశాన వాటికలు అందంగా రూపుదిద్దుకున్నాయి. తాడేపల్లికి మాత్రం శ్మశాన వాటికలను అభివృద్ధి చేసే వారు కరువయ్యారని వాపోతున్నారు. వర్షాలు వచ్చే సమయంలో అంతిమ సంస్కారాల నిర్వహించడానికి ఇబ్బందిగా ఉండటంతో విజయవాడ స్వర్గపురికి మృతదేహాలను తీసుకెళ్లాల్సి వస్తుంది. ఇప్పటికైనా పాలకులు తాడేపల్లి శ్మశాన వాటికల అభివృద్ధి మీద దృష్టి పెట్టాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

శాశ్వత లోక్ అదాలత్‌ను వినియోగించుకోండి

ప్రజాశక్తి-గుంటూరు లీగల్

ప్రజా సేవలు అందించే ప్రభుత్వ, ప్రవేటు సంస్థలకు సంబంధించిన వివాదాలను జిల్లా కోర్టు సముదాయంలోని శాశ్వత లోక్ అదాలత్‌లో పరిష్కరించుకోవచ్చని పర్మినెంట్ లోక్ అదాలత్ ఫర్ పబ్లిక్ యుటిలిటీ సర్వీసెస్ చైర్మన్ పి.వి.రాంబాబు తెలిపారు. శనివారం జిల్లా కోర్టు అవరణలో న్యాయసేవా సదనంలో పి.వి.రాంబాబు, జిల్లా న్యాయసేవాధికార సంస్థ సెక్రటరీ జి.చంద్రమౌళీశ్వరి, బార్ అసోసియన్ అధ్యక్షులు సురేష్‌తో కలసి విలేకరుల సమావేశం నిర్వహించారు. రాంబాబు మాట్లాడుతూ లీగల్ సర్వీసెస్ ఆథారిటీ యాక్ట్-1987 ప్రకారం ఏర్పాటైన ఈ అదాలత్‌లు 10 నోటిఫైడ్ పబ్లిక్ యుటిలిటీ సేవలకు సంబంధించిన వివాదాలను పరిష్కరిస్తున్నాయన్నారు. వాటిల్లో వాయు/రోడ్డు/ నీటి ద్వారా ప్రయాణికులు, వస్తువుల రవాణాకు రవాణా సేవ, పోస్టల్/టెలీగ్రాఫ్/ టెలీఫోన్ సేవ, విద్యుత్ కాంతి, నీటి సరఫరా సంస్థల సేవలు, ప్రజా పరిరక్షణ లేక పారిశుధ్య సేవలు, హాస్పిటల్, డిస్పెన్సరీ సేవలు, బీమా సేవలు, బ్యాంకింగ్, ఫైనాన్స్ సేవలు, విద్యా సేవలు, మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి పథకం సేవలు, గృహ, రియల్ ఎస్టేట్ సేవలు ఉన్నాయన్నారు. ఆయా సేవలకు సంబంధించి వినియోగదారులకు, ఆయా సంస్థలకు గల వివాదాలను ఎటువంటి కోర్టు ఫీజుగానీ, ఖర్చులు గానీ లేకుండా 'పర్మనెంట్ లోక్ అదాలత్ ఫర్ పబ్లిక్ యుటిలిటీ సర్వీసెస్' ద్వారా సత్వరంగా పరిష్కారం పొందవచ్చన్నారు. ఈ సేవలకు సంబంధించి కోర్టులలో వ్యాజ్యం దాఖలు చేయకముందే, 'పర్మనెంట్ లోక్ అదాలత్ ఫర్ పబ్లిక్ యుటిలిటీ సర్వీసెస్' ను సేవా వినియోగదారులతోపాటు, సంస్థలు ఆశ్రయించవచ్చన్నారు. వివాదాలను రాజీ మార్గం ద్వారా పరిష్కరించటానికి ప్రయత్నించి, రాజీ ద్వారా పరిష్కారం కాని పక్షంలో, ప్రవేశపెట్టబడిన సాక్ష్యాధారాలను అనుసరించి వివాదాలను పరిష్కరించి తీర్పు వెలువరిస్తుంది. అలాంటి తీర్పుపైన అప్పీల్ చేయటానికి వీలు లేదన్నారు. జిల్లా కోర్టు అవరణలోని నూతన భవన సముదాయం, రెండవ అంతస్తులో శాశ్వత లోక్ అధాలత్ ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకూ విధులు నిర్వహిస్తుందన్నారు. జిల్లాలో శాశ్వత లోక్ అదాలత్ ఎర్పాటు చేసిన 2003 సంవత్సరం నుంచి ఇప్పటి వరకు దాదాపు 3000 కేసులు వరకు పరిష్కరించినట్లు చెప్పారు. ప్రజలు ఈ శాశ్వత్ లోక్ అదాలత్‌ను వినియోగించుకోవాలని కోరారు. అనంతరం న్యాయసేవాధికార సంస్థ భవనంలో పబ్లిక్ యుటిలిటీ సర్వీసెస్‌పై పర్మినెంట్ పి.వి. రాంబాబు ప్యానల్ అడ్వకేట్స్‌కు ప్రోబోను లాయర్లకు అవగాహన కల్పించారు.



సమావేశంలో మాట్లాడుతున్న పి.వి.రాంబాబు

ఆసుపత్రి వాతావరణం కలుషితం చేయకండి

జిజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్ కుమార్

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

ప్రభుత్వ ఆసుపత్రి వాతవరణాన్ని కలుషితం చెయ్యవద్దని సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్ కుమార్ అన్నారు. శనివారం తనిఖీల్లో భాగంగా సంగం డెయిరిని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ కిరణ్ కుమార్ మాట్లాడుతూ నాలుగు రోజుల క్రితం డెయిరీలో కేవలం సంగం ఉత్పత్తులను మాత్రమే విక్రయిం చమని ఆదేశించిన, పెడ చెవిన పెట్టారని తెలిపారు. ఈ షాపు పూర్తిగా ఆక్రమించుకున్నారన్నారు. వైద్యులు, డాక్టర్లు, రోగుల సహాయకులు తిరిగేందుకు వీలు లేకుండా పోయిందని, వీటి చుట్టూ ఎలుకలు, పంది కొక్కులు తిరగడం వల్ల అపరిశుభ్రమైన వాతావరణం ఏర్పడిం దన్నారు. ఆసుపత్రిని వ్యాపాంస్తులు చిల్లర కొట్టుగా మార్చేస్తు న్నారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. గతంలో ఇదే ఆసుపత్రిలో వెంటిలేటర్ పై ఉన్న చిన్నారిని ఎలుకలు కొరకడం వల్ల చని పోయిన సంఘటనలు చూశామని ఆయన చెప్పారు. ఆక్రమణలతో ఉన్న వాటిని తొలగించి పరిశుభ్రమైన వాతావరణం అందిస్తామని ఆయన చెప్పారు. ఇప్పటికైనా వ్యాపారస్తులు ఆసుపత్రి ని పరిశుభ్రం గా ఉండే విధంగా సహకరించాలని ఆయన కోరారు. ఈ విషయం పై జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్ లకు కూడా తెలియ చేసామని ఆయన అన్నారు.



ఆస్పత్రికి విరాళంగా మందులు అందిస్తున్న డిఆర్‌డిఏ పిడి హరిహరనాథ్, మహిళా సమాఖ్య నాయకులు

ఆధార్ కార్డు తెచ్చుకోండి

ఆసుపత్రి లోని పొరుగు సేవల విభాగం (ఓ పి) కి వచ్చే రోగులు తమ వెంట తప్పనిసరిగా ఆధార్ కార్డులను తీసుకుని రావలసిందిగా సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్ కుమార్ సూచించారు. రీజస్ట్రేషన్ కౌంటర్ వద్ద తమ పేర్లను నమోదు చేసుకోవడంతో పాటు ఆధార్ కార్డు నెంబర్ కూడా ఇవ్వాలని ఆయన తెలిపారు. ఇందువల్ల ఆరోగ్య శ్రీ పథకాలు వర్తింప చేసేందుకు దోహద పడుతుందని ఆయన చెప్పారు. ఆయన వెంట సివిల్ సర్జన్ ఆర్ యం ఓ డాక్టర్ సతీష్ కుమార్ పాల్గొన్నారు.

దాతలు ముందుకు రావాలి

ఆసుపత్రి అభివృద్ధికి దాతలు ముందుకు రావాలని సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్ కుమార్ కోరారు. జిల్లా మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో డి ఆర్ డి ఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ హరిహర నాథ్ సమక్షం లో రూ. 40 వేల విలువ గల మందులను డాక్టర్ కిరణ్ కుమార్ కు అందచేశారు. ఆసుపత్రి పైనున్న మమకారం తో ఈ మందులను ఇచ్చినందుకు వారికి కతజ్ఞతలు తెలిపారు. అదేవిధంగా జిజిహెచ్ లో 30 ఏళ్ళ నుంచి ఎలక్ట్రీషియన్ గా పని చేస్తున్న ఉస్మాన్ కూడా తన వంతు బాధ్యతగా ట్యూబ్ లైట్లను డాక్టర్ కిరణ్ కుమార్ కు అందచేశారు.

నేడు అవగాహన సంస్థలో ఆరోగ్యసభ

ప్రజాశక్తి-గుంటూరు

అవగాహన సంస్థ ప్రతి ఆదివారం క్రమం తప్పకుండా నిర్వహిస్తున్న ఆరోగ్య సభలో భాగంగా నేడు స్థానిక అరండల్‌పేట 15/1, కుబేరా టవర్స్‌లోని సంస్థ కార్యాలయంలో కాళ్ల, చేతులు, మెడ జాలు సమస్యలపై ఆరోగ్య సభ నిర్వహిస్తున్నట్లు సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సభలో రమేష్ హాస్పిటల్స్ న్యూరాలజీ విభాగాధిపతి, న్యూరో ఫిజీషియన్ డాక్టర్ ఎస్.కుమారవేలు ప్రధాన వక్తగా పాల్గొని, పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరిస్తారన్నారు. కావున ఈ అవకాశాన్ని ప్రజలు వినియోగించుకోవాలని కోరారు.



సమావేశంలో మాట్లాడుతున్న అడిషనల్ కమిషనర్

ఓటర్ల సర్వేపై అడిషనల్ కమిషనర్ సమీక్ష

ప్రజాశక్తి-గుంటూరు

నగరపాలక సంస్థ పరిధిలో ఈనెల 21 నుండి ఆగస్ట్ 21 వరకు డోర్ టు డోర్ ఓటర్ల సర్వేలో బిఎల్‌ఓలు సమగ్రంగా సర్వే చేయడానికి వీలుగా పోలింగ్ స్టేషన్ల బౌండరీలు మ్యాప్ అందించాలని నగర కమిషనర్ కీర్తి చేకూరి రెవెన్యూ, పట్టణ ప్రణాళిక అధికారులను ఆదేశించారు.కమిషనర్ ఆదేశాల మేరకు శనివారం కమిషనర్ ఛాంబర్‌లో అదనపు కమిషనర్ పెద్దిరోజా నగరంలో చేపట్టే సర్వేపై పట్టణ ప్రణాళిక అధికారులు, తహసిల్దార్‌లతో ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కమిషనర్ మాట్లాడుతూ నగరంలో ఈ నెల 21 నుండి బిఎల్‌ఓలు తమకు కేటాయించిన పోలింగ్ స్టేషన్ పరిధిలో ఇంటింటికి వెళ్లి ఓటర్ల జాబితా చెక్ చేస్తారని, వారికి వీలుగా పోలింగ్ కేంద్రాల బౌండరీల మ్యాప్‌లు సిద్ధం చేయాలన్నారు. ప్లానింగ్ కార్యదర్శులతో పాటు విఆర్‌ఓలు క్షేత్ర స్థాయిలో బిఎల్‌ఓలకు అందుబాటులో ఉండాలన్నారు. సమావేశంలో సిటీ ప్లానర్ ప్రదీప్‌కుమార్, డిప్యూటీ సిటీ ప్లానర్ కోటయ్య, వెస్ట్ తహస్దీరు సాంబశివరావు, ఎన్నికల విభాగ సూపరిండెంట్ పద్మ, సర్వేయర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పిల్లి మాణిక్యరావు

18వ రోజుకు గుంటూరు ఛానల్ దీక్షలు

ప్రజాశక్తి-గుంటూరు

గుంటూరు ఛానల్‌ను పర్చూరు వరకూ పొడిగించాలని కోరుతూ నల్లమడ రైతు సంఘం కలెక్టరేట్ వద్ద చేపట్టిన నిరాహార దీక్షలు 18వ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా శనివారం దీక్షల్లో టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి పిల్లి మాణిక్యరావు పాల్గొని మద్దతు తెలిపారు. స్వాతంత్ర్య రాక ముందు నుండి నీటి కోసం ఈ ప్రాంత రైతులు పోరాడుతున్నారని, ప్రభుత్వం ఇప్పటికైనా రైతుల సమస్యను గుర్తించి, తక్షణమే నిధులు విడుదల చేయాలని కోరారు. లావు చౌడేశ్వరి మాట్లాడుతూ సాగు, త్రాగునీటి కోసం రైతులు రోడ్డెక్కాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. మొవ్వా పెద్దన్న మాట్లాడుతూ గుంటూరు ఛానల్‌ను పొడిగించే వరకూ పోరాటం ఆగదన్నారు. దీక్షల్లో చౌడేశ్వరి, లావు రమాదేవి, వి.కాశీ అన్నపూర్ణ, కె.వనజ, వి.సునీత, డి.ప్రమీల, కె.రామాంజమ్మ, డి.నాగరాజు, జి.శ్రీనివాస్, డి.రాష్ట్రయ్య, ఎన.సత్యనారాయణ, ఎల్.సతీష్ తదితరులు దీక్షల్లో పాల్గొన్నారు. దీక్షల్లో కూర్చున్న వారికి నల్లమడ రైతు సంఘం నాయకులు డాక్టర్ కొల్లా రాజమోహన్, తదితరులు పూలమాలలు వేశారు.

పారిశుధ్యం అస్తవ్యస్థం

గ్రామాల్లో సమస్యలు పరిష్కరించాలని సిపిఎం నాయకుల వినతి

ప్రజాశక్తి-అమరావతి

ఇటీవల కురిసిన వర్షాల కారణంగా మండలంలోని పలు గ్రామాల్లో పారిశుధ్యం అస్తవ్యస్థంగా ఉందని సిపిఎం పల్నాడు జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు గంజిమాల రవిబాబు అన్నారు. శనివారం అమరావతి సిపిఎం ఆఫీసులో పార్టీ సభ్యులు సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ గ్రామాల్లో మురుగునీరు పారుదల లేకపోవడంతో గృహాల మధ్య నిలిచిపోతుండటంతో దుర్వాసనతో వెదజల్లుతోందని అన్నారు. మురుగునీరు నిలిచిపోవడంతో దోమలు వృద్ధి చెంది డెంగీ, మలేరియా ఇతర వ్యాధులు సంభవించే అవకాశం ఉందని అన్నారు. డ్రైనేజీ కాలవలు లేకపోవడంతో వర్షపు నీరు, మురికి నీరు కలిసి సిసి రోడ్లపై పారుతోందని చెప్పారు. సిపిఎం మండల కార్యదర్శి బి. సూరిబాబు మాట్లాడుతూ అమరావతిలో విజయసార్ బాబు కాలనీలో డ్రైనేజీ కాలువలు లేకపోవడం, ఖాళీ స్థలాల్లో మురికి నీరు నెలల తరబడి నిలబడుతుండటంతో, దోమలు వ్యాప్తి చెందుతుండటం, విషప్రాణులు రోడ్లపైకి చేరుతుండటంతో ప్రజలకు ప్రమాదం ఉందని అన్నారు. ఆయా సమస్యలను పంచాయతీ ఈవో దృష్టికి పలుమార్లు తీసుకెళ్లినా ఫలితం లేదన్నారు. గాజులపాలెం బాబు జగ్జీవన్ రావ్ కాలనీ డ్రైనేజీ కాలువ లేనందువలన ఇళ్లల్లో మురుగునీరు వర్షపు నీరు రోడ్లమీద ప్రవహిస్తున్నాయని చెప్పారు. స్థానిక ఎమ్మెల్యే నంబూరు.శంకరరావు , గడపగడప ప్రచారంలో భాగంగా బాబు జగ్జీవన్ రావ్ కాలనీలో డ్రైనేజీ కాలువలు నిర్మిస్తామని వాగ్దానం చేసినా ఇంతవరకూ అమలు కాలేదని చెప్పారు. ఆయా సమస్యలపై పంచాయతి అధికారులు దృష్టి సారించి పరిష్కరించాలని కోరారు. మురుగుకాల్వల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లాలని, ప్రజలు ఆరోగ్యం మెరుగు కోసం వైద్యాధికారులు కూడా వార్డుల్లో తిరగాలని కోరారు. సమావేశానికి ఎస్ డి మోదిన్ వల్లి అధ్యక్ష వహించారు.టి.కృష్ణ, షేక్. మొహమ్మద్ రఫీ, సయ్యద్. మోదిన్ వలి, ఎం.సుబ్రహ్మణ్యం, ఎస్. వెంకటేశ్వర రాజు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం నాయకులు



కలెక్టర్ ను సత్కరిస్తున్న జోనల్ మేనేజర్ జి.ఎస్.డి ప్రసాద్

నరసరావుపేటలో బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర నూతన శాఖ ఏర్పాటు

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా

పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేట పట్టణంలోని మల్లమ్మ సెంటర్ కన్యకా పరమేశ్వరి ఆలయం ఎదురుగా భారత ప్రభుత్వ రంగ సంస్థ అయిన బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర విజయవాడ జోన్ లో రాష్ట్రంలో తమ 38వ నూతన శాఖను ఏర్పాటు చేయడం జరిగింది. శనివారం ఈ శాఖను పల్నాడు జిల్లా కలెక్టర్ శివ శంకర్ లోతేటి హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఆయా వ్యాపార సంస్థలకు అందుబాటులో ఏర్పాటు చేసిన బ్యాంక్ లో ఖాతాలు ప్రారంభించి తద్వారా బ్యాంక్ సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం కలెక్టర్ ను జోనల్ మేనేజర్ జి.ఎస్.డి ప్రసాద్ సన్మానించారు. బ్రాంచ్ మేనేజర్ షేక్ జానీ బాషా మాట్లాడుతూ నరసరావుపేట , చుట్టుపక్కల ప్రాంత ప్రజలు అవసరాల మేరకు బ్యాంకు సేవలను మెరుగ్గా అందిస్తుందని తద్వారా జిల్లా అభివద్ధిలో భాగంగా తమ శాఖ ఉంటుందని అన్నారు. నూతన శాఖ నందు సేవింగ్ ఖాతా, కరెంట్ ఖాతా, బంగారు ఆభరణాలపై, వ్యవసాయ, వ్యవసాయేతర, ఎడ్యుకేషన్, వ్యాపార ఋణాలు, మహిళా స్వయం సవృద్ధి సంఘాలకు అన్ని సేవలు అందుబాటులో ఉంటాయని తెలిపారు. పల్నాడు ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.



ఎస్ఎఫ్ఐ పల్నాడు జిల్లా నూతన కమిటీ ఎన్నిక

కార్యదర్శిగా కోట సాయికుమార్, అధ్యక్షుడిగా ఎస్ రాజు

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా

నరసరావుపేట పట్టణంలో రోటరీ కమ్యూనిటీ హాల్లో ఎస్ఎఫ్ఐ ప్లీనరీ సమావేశం శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి అశోక్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పల్నాడు జిల్లాలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని ప్రభుత్వ కళాశాలలో ఇంటర్మీడియట్ చదువుకుంటున్న విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు అందజేయాలని, జీవో నెం. 77 రద్దుచేసి పీజీ చదువుకునే విద్యార్థులకు విద్యా దీవెన, వసతి దీవెన ఇవ్వాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల సమస్యలు పరిష్కరించకపోతే భవిష్యత్తులో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థులను ఏకం చేసి ఉద్యమాల బాట పడతామని హెచ్చరించారు. పల్నాడు జిల్లా కార్యదర్శి మాట్లాడుతూ చదువుకునే ప్రతి ఒక్క విద్యార్థికి ఎటువంటి ఆంక్షలు లేకుండా అమ్మ ఒడి ఇవ్వాలని అన్నారు. ప్రభుత్వ కళాశాలలో ఇంటర్మీడియట్ విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు ఇవ్వాలని ఈ నెల 19వ తేదీన విజయవాడలోని ఇంటర్మీడియట్ బోర్డ్ కార్యాలయం వద్ద పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని అన్నారు. ఎస్ఎఫ్ఐ పల్నాడు జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో పల్నాడు జిల్లా అధ్యక్షులు ఎస్ రాజు, నూతన జిల్లా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించండి

ప్రజాశక్తి- గురజాల

గురజాల ఎస్‌బిఐ శాఖ ప్రాంతంలో ఆశ వర్కర్స్ యూనియన్ సమావేశం శనివారం జరిగింది. ఈ సమావేశానికి వెంకటరమణ అధ్యక్షత వహించారు. ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి డి శివకుమారి మాట్లాడుతూ ఆన్‌లైన్ వర్క్, రికార్డు వర్కుల పేరుతో ఆశా వర్కర్లకు రాష్ట్ర ప్రభుత్వం అరకొర వేతనాలు ఇచ్చి వారితో వెట్టిచాకిరి చేయిస్తోందని విమర్శించారు. సర్వర్ ప్రాబ్లం వల్ల 26 ,రికార్డు వర్కులు చేయలేకపోతున్నారని దీనివల్ల అధికారుల బెదిరింపులకు గురి చేస్తున్నారని అన్నారు. ఆన్‌లైన్ లేదా రికార్డు వర్కుల లో ఏదో ఒకటే చేయించాలని, 4జి సిమ్‌తో కలిపి నాణ్యమైన ఫోన్లు ఇవ్వాలని, రికార్డులను ప్రభుత్వమే ఉచితంగా ఇవ్వాలని కనీస వేతనం రూ.26, 000 ఇవ్వాలన్న తదితర డిమాండ్ల సాధన కోసం 18వ తేదీన నరసరావుపేట డీఎం హెచ్‌ఒ ఆఫీస్ వద్ద జరిగే ధర్నాలో ఆశ వర్కర్స్ పెద్ద ఎత్తున పాల్గొనాలని పిలుపు నిచ్చారు.



సమావేశంలో మాట్లాడుతున్న డి.శివకుమారి

అనంతరం గురజాల,మాడుగుల ఆశాల కమిటీలను విడివిడిగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో అధ్యక్షులు పత్తిపాటి వెంకటరమణ, ఉపాధ్యక్షులు జి. శాంతి, కార్యదర్శి పేరుపోగు సుమతి, జాయింట్ సెక్రెటరీ సిహెచ్ మాధవి, కోశాధికారి ఎస్ నగ్మా, సభ్యులు మల్లికా సీతా మహాలక్ష్మి, గురజాల యుపిహెచ్ అధ్యక్షులు జి సీత, ఉపాధ్యక్షులు భాగ్యలక్ష్మి, కార్యదర్శి పసుకుర్తి జ్యోతి, జాయింట్ సెక్రెటరీ వీ రాజ్యలక్ష్మి, కోశాధికారి జక్కా ఎన్నువతి, సభ్యులు బొడ్డు శకుంతల, విశాలాక్షి, సిఐటియు జిల్లా నాయకులు తెలకపల్లి శ్రీనివాసరావు,షేక్ సిలార్ మసూద్ పాల్గొన్నారు.

18న ఆశా వర్కర్ల ధర్నా

ప్రజాశక్తి-పిడుగురాళ్ల



వినతిపత్రం అందజేస్తున్న సిఐటియు నాయకులు

ఈ నెల 18 వ తేదీన నరసరావుపేట డిఎం హెచ్‌ఓ ఆఫీస్ వద్ద జరిగే ఆశ వర్కర్ల ధర్నా జయప్రదం చేయాలని సిఐటియు నాయకులు కోరారు.శనివారం పిడుగురాళ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య అధికారి ప్రభావతికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు మండల కార్యదర్శి తెలకపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఆన్లైన్ వర్క్, 26 రికార్డులు రాయాలనే పేరుతోటి ఆశా వర్కర్లను రాష్ట్ర ప్రభుత్వం వెట్టి చాకిరి చేయిస్తుందని ఆయన విమర్శించారు. ధర్నాలో ఆశ వర్కర్లు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని పిలుపు నిచ్చారు. వినతిపత్రం అందజేసిన వారిలో సిఐటియు మండల అధ్యక్షులు సంపతి వెంకటకృష్ణ, ఆశ వర్కర్లు నిర్మల ,జెమేమియా, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

వామపక్ష కార్మిక సంఘాల ర్యాలీ, ధర్నా

ప్రజాశక్తి-పిడుగురాళ్ల



వామపక్ష కార్మిక సంఘాల ఆధ్వర్యంలో భవన నిర్మాణ సంక్షేమ బోర్డు ద్వారా ఆగిపోయిన పథకాలు పునరుద్ధరించాలని కోరుతూ పిడుగురాళ్ల పట్టణంలోనే గంగమ్మ గుడి సెంటర్ నుండి వైఎస్ఆర్ పార్టీ ఆఫీస్ వరకు శనివారం ర్యాలీ, ధర్నా నిర్వహించారు. అనంతరం ఆఫీస్ సిబ్బందికి సమస్యల తోటి కూడిన వినతి పత్రం అందజేశారు.ఈ కార్యక్రమంలో పల్నాడు జిల్లా భ వననిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షులు ప్రసాదరావు హాజరై మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికులకు కష్టం కలిగించే 1214 జీవోను వెంటనే ఉపసంహరించుకోవాలని, భవన నిర్మాణం యజమానుల నుండి వసూలు చేసే సెజ్ ను రద్దు చేయడం దుర్మార్గం అని ఆయన విమర్శించారు.కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి తెలకపల్లి శ్రీనివాసరావు ఎఐటీయుసీ పట్టణ నాయకులు జె.కృష్ణానాయక్,నిర్మాణ కార్మికులు ఎం.బుజ్జి, పి కృష్ణ, ఎం.శ్రీనివాసరావు, ఎం రామకృష్ణ ,టి.ఆంజనేయులు, సాల్మను, చిలక ఏసు, జి.రాజు తదితరులు పాల్గొన్నారు.

చామర్రు బాధితుల నిరసన ర్యాలీ

ప్రజాశక్తి-అచ్చంపేట


ఎన్నో ఏండ్లుగా రోడ్డు వెంబడి ఉన్న ప్రభుత్వ స్థలంలో నివాసాలు ఉంటున్న పేదల స్థలాలపై రెవెన్యూ అధికారులు కోర్టు అనుమతుల పేరుతో చదును చేయించారంటూ చామర్రు రోడ్డులోని నివేశనా స్థలాల బాధితులు ఆరోపించారు అచ్చంపేట చామరు రోడ్డు వెంబడి నివాస గృహాలు వెనుక భాగాన మరికొంద రు పేదలకు చెందిన ఖాళీ స్థలాలు వీఆర్వో బాలు నాయక్ శుక్రవారం చదును చేయించారని, చామర్ రోడ్డులో నివాసం ఉంటున్న వల్లెపు శ్రీనివాసరావు అన్నారు. పంట పొలాలకు పెళ్లెందుకు దారి లేదంటూ 2014లో రాయుడు వేణుగోపాల్,మరికొందరు రెవెన్యూ, పోలీస్ కలెక్టర్ బాధ్యుల్ని చేస్తూ కోర్టులో కేసు వేశారని, అదే క్రమంలో ప్రతిపక్షంలో ఉన్న వైసిపి నాయకులు పేదలతో కలిసి 20 సంవత్సరాలుగా నివసిస్తున్నామని, తమ స్థలాలకు పట్టాలి ఇప్పించాలంటూ 45 మంది బాధితులను కలిసి కోర్టును ఆశ్రయించారు. అప్పటి తహశీల్దార్ చామర రోడ్డులో నివాసం ఉంటున్న మమ్మల్ని అందరినీ వారి వద్దనున్న ఆధారాలతో తహశీల్దార్ కార్యాలయానికి పిలిపించడం, s ఈ క్రమంలో ఇరువురికి సర్దుబాటు చేస్తూ ఎనిమిది రహ దారులను కేటాయించారని శ్రీనివాసరావు వివరించారు . అప్పటి తహశీల్దారు కోర్టుకు నివేదిక పంపినట్లు



తెలియ జేశారన్నారు. ఈ క్రమంలో కూలి పనులకు వెళ్లిన సమయంలో పంట పొలాల వారు రెవెన్యూ అధికారులు కలసి ప్రోక్లైన్లతో ఖాళీ స్థలాలను చదును చేయిస్తున్నారని అదే క్రమంలో ఇల్లు నిర్మించేందుకు బేస్ మట్టం వేసిన వాటిని కూడా తొలగించారని, కూలి పనులకు వెళ్లి తిరిగి వచ్చిన పేదలు పొక్లైన్‌కు అడ్డం తిరగడంతో వీఆర్వో బాలు నాయక్ పోలీసులకు పిలిపించి గెంటించి వేశారని బాధితులు ఆరోపించారు. రెవెన్యూ అధికారుల తీరును నిరసిస్తూ శనివారం అచ్చంపేట లో నిరసన ర్యాలీ నిర్వహించినట్లు చెప్పారు. వెంటనే స్థానిక ఎమ్మెల్యే జోక్యం చేసుకొని పేదలకు న్యాయం చేయాలంటూ వారి తరఫున వల్లెం శ్రీనివాసరావు డిమాండ్ చేశారు ఈ విషయంపై తహశీల్దార్ కె.పద్మావతిని వివరణ కోరగా కోర్టులో కం టెంట్ కేసు ఉందని గతంలో ఇచ్చిన దారులను మాత్రమే చదును చేయించామని చెప్పారు. కోర్టు కేసు తీర్పు అనంతరం నివసిస్తున్న లబ్ధిదారులకు పట్టాలిచ్చి, కొత్త నిబంధనల ప్రకారం రిజిస్ట్రేషన్ చేసే విలువ కలుగు తుందంటూ వివరించారు.

సమానపనికి సమాన వేతనం ఇవ్వండి

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా



ఎమ్మెల్యేకి వినతిపత్రం ఇస్తున్న మున్సిపల్ కార్మికులు

ఎన్నికల సమయంలో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన హామీ మేరకు మున్సిపల్ అవుట్సోర్సింగ్ కార్మికులందరినీ రెగ్యులర్ చేయాలని ఇచ్చిన ఎన్నికల హామీలను నిలబెట్టుకోవాలని కార్మికులందరినీ రెగ్యులర్ చేయాలని కోరుతూ మున్సిపల్ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో కార్మికులు స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద నుండి ర్యాలీగా మున్సిపల్ అతిథి గృహ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లారు. అక్కడ అధికారిక కార్యక్రమంలో ఉన్న ఎమ్మెల్యేకి వినతిపత్రం అందజేశారు. అనంతరం మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు సిలార్ మసూద్ మాట్లా డారు. జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.సాల్మన్, టి.మల్లయ్య, డి.యోహాన్,పి.ఏసు, వీరకుమార్, జీవరత్నం, నరసింహారావు, ఎ.మార్తమ్మ, లుదియమ్మ, లలిత, కె. ఏసమ్మ, స్వాతి, తదితరులు పాల్గొన్నారు.

టెండర్

- బిల్లులు విడుదల చేయని ప్రభుత్వం
- నాలుగులైన్ల రోడ్డు విస్తరణకు నీళ్లు
- ఎమ్మెల్యే చెప్పినా ముందుకు రాని వైనం
- కాంట్రాక్టర్లపై తీవ్ర చర్యలకు సిద్ధపడని అధికారులు

ప్రజాశక్తి-తెనాలి:

గతంలో ప్రభుత్వ పనులంటే కాంట్రాక్టర్లు పోటీ పడేవారు. ప్రస్తుతం సీన్ రివర్స్ నడుస్తుంది. నామినేటెడ్ వర్కు అప్పచెప్పినా చేసే పరిస్థితులు లేవు. ఇటీవల ఓ పని విషయంలో కాంట్రాక్టర్‌కు ఎమ్మెల్యే చెప్పినా అదిగో... ఇదిగో అంటూ దాటవేశారు కాని పనిచేయ లేదు. అదేమంటే గతంలో చేసిన వాటికే బిల్లులు చెల్లించలేదు. కొత్తగా మీదేసుకునే పరిస్థితి లేదని కాంట్రాక్టర్లు వాపోతున్నారు. అలాగని ప్రభుత్వం పెండింగ్ బిల్లులు చెల్లించేందుకు చొరవ చూపదు. ఈ నేపథ్యంలో రోడ్ల దుస్థితిపై అధికారులే ప్రజల దృష్టిలో దోషులుగా మిగులుతున్నారు. ఏం చేయాలో చెప్పండి".. అంటూ ఆర్అండ్‌బి ఉన్నతాధికారులు వాపోతున్నారు.

తెనాలి ఆర్అండ్‌బి పరిధిలో రోడ్ల దుస్థితికి సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. నాలుగు లైన్ల రోడ్డు విస్తరణకు పెదరావూరు నుంచి ఆటోనగర్ వరకూ ప్రతిపాదించారు. ఇది గతంలో కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రారంభమైంది. నాదెండ్ల మనోహర్ స్పీకర్‌గా ఉన్న సమయంలో పెదరావూరు నుంచి ప్రతిపాధించిన నాలుగు లైన్ల రోడ్డును బస్టాండ్ వరకూ పూర్తి చేశారు. అనంతరం అధికారంలోకి వచ్చిన టిడిపి ప్రభుత్వంలో అప్పటి ఎమ్మెల్యే ఆలపాటి రాజేంద్రప్రసాద్ సారధ్యంలో బస్టాండ్ నుంచి వివిస్సార్ కళాశాల వరకూ రోడ్డును పూర్తి చేశారు. ఇక



రీటెయినింగ్ వాల్‌కు, రోడ్డుకు మధ్య పెరిగిన చెట్లు

వైసిపి అధికారంలోకి రావటానికి ముందు, అంటే టిడిపి పాలన చివరలో 2018లో విస్సార్ కళాశాల నుంచి ఆటోనగర్ వరకూ రోడ్డును ప్రారంభించారు. ఈ రోడ్డు వాస్తవానికి 18 నెలల్లో పూర్తి చేయాలి. దీనిలో రోడ్డు నిర్మాణంతో పాటు సెంటర్ డివైడర్లు, రీటెయినింగ్ వాల్స్ నిర్మాణం జరగాలి. అయితే గత రెండు ప్రభుత్వాల్లో కొంత మేరకు పని జరిగినా, వైసిపి ప్రభుత్వంలో మాత్రం తూతూ మంత్రంగా మినహా పనిజరగలేదు. రెండు నెలల క్రితం విస్సార్ కళాశాల నుంచి ఆటో నగర్ వరకూ తూర్పు కాలువ అంచుకు నిర్మించిన రీటెయినింగ్ వాల్‌కు, రోడ్డుకు మధ్య గ్రావెల్‌తో ఫిల్లింగ్ చేసేందుకు పనులు ప్రారంభించారు. ఇంకేముంది రోడ్డు పనులు ప్రారంభమయ్యాయని అంతా సంబరపడ్డారు. అధికారులు కూడా రోడ్డు నిర్మాణం పూర్తవుతుందని చెప్పుకొచ్చారు. పట్టుమని పది రోజులు కూడా పనిజరగలేదు. ఎక్కడికక్కడ పనులు నిలిచిపోయాయి. ఇలా రోడ్డు నిర్మాణంలో జాప్యం కారణంగా ఆటోనగర్ నుంచి వివిస్సార్ కళాశాల వరకూ రోడ్డు పూర్తిగా దెబ్బతింది. వాహనచోదకులు ఎన్నో సమస్యలు ఎదుర్కొంటున్నారు. అయినా అధికారులు, ప్రజాప్రతినిధుల్లో ఏమాత్రం చలనం లేదు. మరో వైపు



తెనాలి బండ్ వద్ద పూర్తి చేయాల్సిన ఫుట్‌పాత్ ఫ్లోరింగ్

రోడ్డు విస్తరణలో భాగంగా ఆటో నగర్ వరకూ ఎడమవైపున వేసిన రోడ్డు శిధిలావస్తకు చేరుతుంది. మరోవైపు రోడ్డు నిర్మాణం చేపట్టిన కాంట్రాక్టర్ పత్తా లేడు. పనుల జాప్యంపై స్పందించటం లేదన్నది అధికారుల వాదన. నోటీసులకు, ఫోన్లకు స్పందించ కుండా, మరో వైపు పనులు చేయకుండా ఉన్న కాంట్రాక్టర్‌ను బ్లాక్ లిస్ట్‌లో పెట్టి, మరొకరికి అ పనిని కేటాయించాల్సిన బాధ్యత అధికారులపై ఉంది. అయితే అధికారులు కూడా ఖచ్చితమైన చర్యలు తీసుకోకపోవటం వెనుక పరమార్థం ఏమిటన్నది మిలియన్ డాలర్ల ప్రశ్న.

ఎమ్మెల్యే చెప్పినా పట్టించుకోని కాంట్రాక్టర్

తెనాలి ఖ్యాతిని ఇనుమడింప చేసేలా తెనాలి బండ్ నిర్మాణానికి అధికారులు కసరత్తు చేస్తున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో బండ్ పై విగ్రహాలు నెలకొల్పేందుకు రోడ్డుకు ఎడమ మార్జిన్ అంటే ఫుట్‌పాత్‌పై దిమ్మెలు ఏర్పాటు చేశారు. దిమ్మెలు ఏర్పాటు చేసిన ప్రాంతంలో నాలుగు లైన్ల రోడ్డు విస్తరణలో భాగంగానే ఫుట్‌పాత్‌కు కూడా టైల్స్ అంటించాల్సి ఉంది. రోడ్డు సంగతి ఎలా ఉన్నా బండ్ నిర్మాణం వేగవంతం చేయాలన్న సంకల్పంతో ఇటీవల సంబంధిత కాంట్రాక్టర్‌ను పిలిపించిన ఎమ్మెల్యే, దిమ్మెల వరకైనా ఫుట్‌పాత్ పూర్తిచేయాలని



ఆటోనగర్ వద్ద అధ్వానంగా ఉన్న రోడ్డు

కోరినట్లు సమాచారం. వారంలోగా మొదలు పెడతానన్న కాంట్రాక్టర్ దాదాపు 20 రోజులు పైబడినా స్పందన లేదని ఆర్అండ్‌బి అధికారులే చెబుతున్నారు. ఇంతటి దయనీయ పరిస్థితుల్లో నాలుగు లైన్ల రోడ్డు నిర్మాణం కథ కంచికేనా అన్న భావన అందరిలోనూ వ్యక్త మౌతోంది.

కాంట్రాక్టర్లు స్పందించడంలేదు..

-ఎ.నాగేశ్వరరావు, డిఈఈ, ఆర్అండ్‌బి, తెనాలి

నాలుగులైన్ల రోడ్డు విస్తరణకు సంబంధించి 2018లో విస్సార్ కళాశాల నుంచి ఆటోనగర్ వరకూ పనులు ప్రారంభించాం. వాస్తవానికి 18 నెలల్లోగా పనులు పూర్తి చేయాలి. ఐదేళ్లు పూర్తయినా ఇప్పటికి కనీసం 50శాతం పనికూడా పూర్తి కాలేదు. సంబంధిత కాంట్రాక్టర్ ఫోన్‌కు స్పందించటంలేదు. ఐదారు నోటీసులిచ్చినా సమాధానం లేదు. అతనికైతే ఎలాంటి బిల్ పెండింగ్‌లేదు. ప్రత్యామ్నా యం ఆలోచిస్తున్నాం. అలాగే నందివెలుగు-గుంటూరు రోడ్డుకు రూ.3.30కోట్లు, నందివెలుగు నుంచి రేవేంద్ర పాడు వరకూ రూ.6.60కోట్లు మంజూరయ్యాయి. ఈ నిధు లతో ప్యాచ్ వర్కుచేసి, దానిపై సింగిల్ లేయర్ రోడ్డు వేయాలి. కొత్తగా టెండర్లు వేసేందుకు కాంట్రాక్టర్లు ముందుకు రావటంలేదు. ఎందుకంటే గతంలో చెల్లించాల్సిన బిల్లులు కోట్లలోనే పెండింగ్‌లో ఉన్నాయి. కాంట్రాక్టర్లు ముందుకు రానిదే వర్కులు కదలని పరిస్థితి.

ప్రభుత్వ వైద్య సేవలు ప్రజలకు చేరాలి

ప్రజాశక్తి-ప్రత్తిపాడు :ప్రభుత్వాం ఇచ్చే వైద్య సదుపాయాలు ప్రతి ఒక్కరికి చేరువ చేయాలని డిఎంఅండ్ హెచ్ఒ డి శ్రావణ్ బాబు అన్నారు. శనివారం ప్రత్తిపాడు మండల కేంద్రంలోని సచివాలయం 3 హెల్త్ అండ్ వెల్నెస్ సెంటర్‌ను సందర్శించారు. ఈ సెంటర్‌ల ద్వారా వైద్యసేవలు ప్రజలకు మరింత చేరువయ్యాయని తెలిపారు. 65రకాల మందులు కూడా అందుబాటులో ఉన్నాయన్నారు. సూపర్‌వైజర్ నిర్మలాదేవి, ఆశాలతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆశాలు మాట్లాడుతు తమ జాబ్ చార్టు తెలియజేయాలన్నారు.



తాడికొండలో మాట్లాడుతున్న దండా లక్ష్మీనారాయణ

అంగన్వాడీలపై రాజకీయ వేధింపులు ఆపాలి

ప్రజాశక్తి-తాడికొండ

అంగన్వాడీల పై రాజకీయ వేధింపులు ఆపాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు డి లక్ష్మీనారాయణ అన్నారు. శనివారం తాడికొండ గ్రామంలోని పాత సినిమా హాలులో మండల కమిటీ సమావేశం నిర్వహించారు. అంగన్వాడీలకు ఇచ్చిన ఎన్నికల హామీలను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయాలని లక్ష్మీనారాయణ డిమాండ్ చేశారు. అంగన్వాడీలకు తెలంగాణ ప్రభుత్వం కంటే రూ.వెయ్యి అదనంగా ఇస్తానన్న హామీని నెరవేర్చాలని అన్నారు. అర్హులైన ఆయాలకు టీచర్లుగా పదోన్నతి కల్పించకుండా రాజకీయ నాయకులు అడ్డుపడటం హేయమన్నారు. వేతనాలు ఐదో తారీకు లోపు ఇస్తామన్న ప్రభుత్వం నెలలు తరబడి పెండింగ్‌లో ఉంచడం తగదన్నారు. అంగన్వాడీ కేంద్రాలకు అద్దెలు సరిగ్గా చెల్లించకపోవడంతో అంగన్వాడీలపై అదనపు భారం పడుతుందన్నారు. వీరిని ప్రభుత్వ ఉద్యోగులని చెప్పి వారికి రావలసిన సంక్షేమ పథకాలను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయడం అర్హులను గుర్తించి సంక్షేమ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం కార్మికులకు చేస్తున్న ద్రోహానికి వ్యతిరేకంగా కార్మికులందరూ ఐక్య పోరాటానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. అనంతరం అంగన్వాడి నూతన కమిటీని ఏర్పాటు చేశారు. అధ్యక్ష, కార్యదర్శులుగా నూర్జహాన్, విజయలక్ష్మి, కోశాధికారిగా ఏసు మరియమ్మ, ఉపాధ్యక్షురాలిగా జ్యోతి, సహాయ కార్యదర్శిగా జాస్మిన్ రోజా సహా 8మందితో కమిటీ ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సిఐటియు, రైతుసంఘం నాయకులు యడ్లపల్లి గాంధీ రామ్మోహన్రావు, కనగాల పూర్ణచంద్రరావు, చింతల భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.



వినతి పత్రం ఇస్తున్న రామకృష్ణ,ఆశాలు

18న గుంటూరులో ధర్నా జయప్రదం చేయండి

ప్రజాశక్తి- మేడికొండూరు

ఆశాలు తమ సమస్యలు పరిష్కరించుకోవడానికి 18వ తేదీ గుంటూరు జిల్లా డిఎం హెచ్ ఓ ఆఫీస్ వద్ద జరుగు ధర్నా జయప్రదం చేయాలని సిఐటియు మండల కన్వీనర్ బొట్ల రామకృష్ణ తెలిపారు. శనివారం మండల ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రం వైద్యులు డాక్టర అనిరుద్‌కి వినతి పత్రం ఇచ్చారు. ఆశ వర్కర్లకు సెల్‌ఫోన్‌లు ఇచ్చి రోజురు 16 యాప్‌లలో పని చేయాలని, 26 ఫైల్స్ రాయాలని చెబుతున్నారన్నారు. అయితే రికార్డులు రాయడానికి పుస్తకాలు, ఫోన్‌లో నెట్ బిల్లు ఇవ్వకుంటే అశాలకు అది అదనపు భారమవుతుందన్నారు. టిఎ, డిఎలు కూడా ఇవ్వడం లేదన్నారు. సమస్యలు పరిష్కారం కోసం నిర్వహించే ఆందోళనలో మండలంలోని ఆశాలు పాల్గొనాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఆశ వర్కర్ల యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు ఎం గౌస్య, టి తాన్య, టీ లావణ్య, శంషాద్ బేగం ,సుజాత, సునీత ఇంకా తదితరులు పాల్గొన్నారు.

చౌడవరం వెల్ఫేర్ అసిస్టెంట్ హుస్సేన్ మృతి

- రోడ్డు ప్రమాదానికి గురై ఏడాది నుండి చికిత్స

ప్రజాశక్తి-గుంటూరు



చౌడవరం సచివాలయం వెల్ఫేర్ సెక్రెటరీగా విధులు నిర్వహిస్తూ మృతి చెందిన షేక్.హుస్సేన్ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని సచివాలయ ఉద్యోగులు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు శనివారం హుస్సేన్ భౌతిక ఖాయాన్ని వట్టిచెరుకూరు మండలం, వల్లూరులో అతని నివాసం వద్ద సందర్శించి నివాళులర్పించారు. హుస్సేన్‌కు తల్లి, భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. హుస్సేన్ గత ఏడాది ఆగస్టులో విధులు ముగించుకొని ఇంటికి వెళ్తున్న సమయంలో గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో తీవ్ర ప్రమాదం సంభవించి, అప్పటి నుండి కోమాలో ఉన్నాడు. కొన్ని నెలులగా నగరంలోని ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స తీసుకున్నప్పటికీ ఆరోగ్యంలో ఎలాంటి మార్పు రాలేదు. అయినా మందులు వాడుతూ రెండు నెలల క్రితం ఇంటికి తీసుకొచ్చారు. శుక్రవారం మధ్యాహ్నం హుస్సేన్ మరణించాడు. తోటి సచివాలయ ఉద్యోగులు పెద్ద సంఖ్యలో హాజరై హుస్సేన్‌కు నివాళి అర్పించారు. చిన్నప్పటి నుండి ఎంతో కష్టపడి, ప్రభుత్వ హాస్టల్లో ఉండి, ఎంఫిల్ వరకూ చదుకున్నాడు. హుస్సేన్ తండ్రి నెల క్రితం చనిపోయాడు. ప్రభుత్వం హుస్సేన్ కుటుంబాన్ని ఆదుకోవాలని, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. హుస్సేన్ భౌతిక ఖాయాన్ని సందర్శించిన వారిలో కంచె నాగేశ్వరరావు, రాజారావు, ధనలక్ష్మి, మహేష్ తదితరులున్నారు.



అభివాదం చేస్తున్న వివిధ సంఘాల నాయకులు

దగా పడ్డ ఆంధ్రులను మేలుకొలుపుతాం

ప్రజాశక్తి-గుంటూరు

దశాబ్దాలుగా పాలక పార్టీలు ఆంధ్రులను అన్ని విధాలుగా దగా చేస్తూ, వంచిస్తున్నాయని లక్షలాది మంది ప్రజలను చైతన్యవంతలను చేస్తూ రాజధాని అమరావతి, విశాఖఉక్కు, పోలవరం ప్రాజెక్టు, ప్రత్యేక హెూదా, రాష్ట్రం నుండి తరలిపోతున్న పెట్రోల్, గ్యాస్‌ల ద్వారా రావలసిన వాటా తదితర రాష్ట్రానికి జరిగిన అన్యాయాలపై ప్రభుత్వాలను నిలదీస్తూ, అనుకున్న లక్ష్యాలను సాధిస్తామని జై ఆంధ్ర, ఉమ్మడి ప్రజాసంఘాల ఐక్యవేదిక ప్రకటించింది. శనివారం స్థానిక హిందూ కళాశాల ఆవరణలోని ఏకాదండయ్య సమావేశ మందిరంలో జై ఆంధ్ర ఉద్యమ సంస్థ, పలు ప్రజాసంఘాల నేతల రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. జై ఆంధ్ర నిర్వాహకులు వై.మహదేవ మాట్లాడుతూ 32 మంది యువకుల బలిదానంతో ఏర్పడిన విశాఖ ఉక్కు కర్మాగారం, లక్షల కోట్ల సంపద అదానికి దోచిపెట్టె కేంద్ర ప్రభుత్వంపై ప్రజా ఆందోళనను ఉధతం చేస్తామని హెచ్చరించారు. ఆంధ్రప్రదేశ్ ప్రొఫెషనల్ ఫోరం అధ్యక్షులు నేతి మహేష్‌కుమార్, పోలవరం ప్రాజెక్టు నిర్వాసితుల సంఘం నాయకులు రంజిత్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రజల జీవనాడి పోలవరం ప్రాజెక్టును నిర్వీర్యం చేసేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేస్తున్న దగాను ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో గంగవరం పోర్టు బాధితుల సంఘం నాయకులు వై.అప్పారావు, డిబిఎఫ్ నాయకులు కొరివి వినయ్‌కుమార్, ప్రత్యేక హోదా సాధన సమితి నాయకులు అవధానుల హరి, అవగాహన శివరామిరెడ్డి, లోక్ సత్తా వల్లూరి సదాశివరావు, అమరావతి రాజధాని ఉద్యమ నాయకులు పివి మల్లికార్జునరావు, జొన్నలగడ్డ శ్రీనివాసరావు, పలు ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు



రైతు భరోసా కేంద్రం సహాయకులకు అవగాహన

ప్రజాశక్తి-నాదెండ్ల

ఖరీఫ్ పంట సాగు మొదలైన దృష్ట్యా నాదెండ్ల రైతు భరోసా కేంద్రంలో శనివారం రైతు భరోసా కేంద్రం సహాయకులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు ఈ కార్యక్రమంలో పల్నాడు జిల్లా వనరుల కేంద్రం డి డి ఏ శివకుమార్ పాల్గొని అవగాహన కల్పించారు కంది అపరాలు పత్తి మరియు మిరప పంటలపై యాజమాన్య పద్ధతులు సస్యరక్షణ అవగాహన కల్పించారు అలాగే నరసరావుపేట ఏడిఏ మస్తానమ్మ మాట్లాడుతూ గ్రామ సహాయకు లు గ్రామాల్లో కౌలు రైతులకు సిసిఆర్ సి పట్టాలు వచ్చేలాగా చూడాలన్నారు అలాగే పిఎం కిసాన్ లబ్ధిదారులందరికీ ఈ కేవైసీ జరిగేలా చూడాలని తెలిపారు. కార్యక్రమంలో నాదెండ్ల ఏవో హరిప్రసాద్ అన్ని గ్రామాల వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు

రోటరీ డ జోనల్ చైర్మన్ గా బెల్లంకొండ

ప్రజాశక్తి-సత్తెనపల్లి రూరల్



2023- 24 వ సంవత్సరానికి రోటరీ స్పోర్ట్స్ అండ్ ఫెలోషిప్ కార్యక్రమానికి డిస్టిక్ 3150 జోనల్ 7 కు చైర్మన్ గా సత్తెనపల్లి రోటరీ క్లబ్ బాధ్యులు బెల్లంకొండ నాగ సాయి ప్రసాద్ ను రోటరీ డిస్టిక్ గవర్నర్ బూసిరెడ్డి శంకర్ రెడ్డి శనివారం నియమించారు. ఈ సందర్భంగా బెల్లం కొండ నాగ సాయి ప్రసాద్ మాట్లాడుతూ తన పై నమ్మకం తో 19 క్లబ్ ల పరిధిలో స్పోర్ట్స్ మీట్స్ మరియు ఫెలోషిప్ కార్యక్రమాల ఏర్పాటుకు తన వంతు కృషి చేస్తానని అన్నారు.

కేసన శంకరరావు పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా

మండల కేంద్రం రొంపిచర్ల చెరువుకట్ట సెంటర్లో గల బిసి సంక్షేమ సంఘం మండల కార్యాలయంలో శనివారం బిసి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకర్రావు జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి బాదుగున్నల శ్రీనివాసరావు మాట్లా డుతూ బిసి, వెనుకబడిన కులాల అభ్యున్నతి కోసం పాటుపడుతున్న ప్రజల మనిషి కేసన శంకరరావు అని కొనియాడారు. కార్యక్రమంలో బిసి సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడు గాలి సాంబశివరావు, బిసి సంక్షేమ సంఘం నియోజకవర్గ ఉపాధ్యక్షుడు సరికొండ తిమ్మరాజు, నరసరావుపేట పట్టణ అధ్యక్షుడు కొల్లిపర బాలాజీ, మండల నాయకులు కోనేటి నరసింహారావు, సుబ్బరాజు, శ్రీనివాస రావు, ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

వికలాంగులకు పరికరాల పంపిణీ

ప్రజాశక్తి-విజయపురిసౌత్

వికలాంగులకు ఉపకరణాలు, సహాయ పరికరాల ఉచిత పంపిణీ కోసం శనివారం మాచర్ల నియోజకవర్గం లోని అన్ని మండలాల వారికి మండల పరిషత్ కార్యాలయంలో శనివారం క్యాంపు ఏర్పాటు చేశారు. వికలాంగులకు చేతికర్రలు, చంకకర్రలు, వీల్ చైర్లు, వినికిడి యంత్రాలు, మూడు చక్రాల సైకిల్ లు, ఎంఎస్ఐఇడి కిట్లు, అంధుల చేతి కర్రలు, లెప్రసి కిట్లు, డైసీ ప్లేయర్, కృత్రిమ అవయవాలు, మొదలగు ఉపకరణాలు, సహాయక పరికరాల పంపిణీకి అర్హులైన వారికి పరీక్షలు నిర్వహించి ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న మాచర్ల ఎంపీపీ బూడిద శ్రీనివాసరావు, మండల పరిషత్ అభివృద్ధి అధికారి కోటేశ్వరరావు,జెడ్పీటీసీ మల్లుస్వామి ,సంబంధిత వైద్యాధికారులు పాల్గొన్నారు

రాయితీపై బియ్యం, కందిపప్పు

ప్రజాశక్తి-సత్తెనపల్లి

నిత్యావసర ధరలు ఊహించిన రీతిలో పెరిగిన నేపథ్యంలో పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో బియ్యము, కందిపప్పు రాయితీపై పంపిణీ చేస్తూ.. ప్రజలకు ఉప శమనం కల్పిస్తున్నామని రాష్ట్ర జల వనరుల శాఖామంత్రి అంబటి రాంబాబు అన్నాం ు. శనివారం పట్టణంలోని వావిలాల కాంప్లెక్స్ లో 12వ నంబర్ దుకాణంలో పట్టణ చాంబర్ ఆఫ్ కామర్స్ సౌజన్యంతో బియ్యము, కందిపప్పు రాయితీ కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రభుత్వం రాయితీపై అందిస్తున్న నిత్య అవసరాలను వినియోగించుకోవాలని సూచించారు.చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు చల్లంచర్ల సాంబశివరావు మాట్లాడుతూ బియ్యం కిలో రూ.49 లు, కందిపప్పు కిలో రూ.135 ల చొప్పున, జెసి వద్ద ఒప్పందం జరిగిందని, అయినా మంత్రి అంబటి సూచనల మేరకు బియ్యం కిలో రూ. 45 లకు, కందిపప్పు రూ.133 లకే అందిస్తున్నామని ఆయన వివరించారు. కార్యక్రమంలో వాణిజ్య విభాగం పల్నాడు జిల్లా అధ్యక్షులు అచ్యుత శివప్రసాద్, ఛాంబర్ సభ్యులు తాళ్లూరి మోహన్ బాబు, తాళ్లూరి సతీష్, మోహన్ బాబు , జవాజి రవి కష్ణ, గుండా పూర్ణ, కాకపర్తి వెంకయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పౌరసరఫరాల శాఖ వారి ఆదేశాలు మేరకు రైస్ అండ్ డాల్ మిల్లర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఛాంబర్ ఆఫ్ కామర్స్ వారి సహకారంతో ఏర్పాటు చేసిన బియ్యం, కందిపప్పు విక్రయ కేంద్రాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి అన్నారు. నరసరావుపేట పట్టణం లోని మల్లమ్మ సెంటర్ సమీపంలో రాయితీపై బియ్యం మరియు కందిపప్పు పంపిణీకి ఏర్పాటు చేసిన ప్రత్యేక విక్రయ కేంద్రాన్ని జాయింట్ కలెక్టర్ ఏ.శ్యాం ప్రసాద్, పౌర సరఫరాల శాఖ అధికారి పద్మశ్రీ లతో కలిసి ప్రారం భించారు. విక్రయ కేంద్రంలో బియ్యం 1 కిలో రూ 49/- కందిపప్పు 1కిలో రూ 135/- పంపిణీ చేస్తున్నా మన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మొక్కజొన్న, పత్తి, మిర్చి వంటి పంటల వైపు రైతులు మొగ్గు చూపుతూ పప్పు దినుసులు పంటలను నిర్లక్ష్యం చేయడం వల్ల కందిపప్పు ధర పెరిగిందన్నారు. దీన్ని అధిగమించేందుకు ప్రభుత్వ పరంగా జగనన్న సురక్ష కార్యక్రమంలో కంది సాగుకు ముందుకు వచ్చిన రైతులకు ఉచితంగా 2 ఎకరాలకు సరిపడా కంది విత్తనాలు పంపిణీ చేస్తున్నామన్నారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా కూడా 2 ఎకరాల లోపు కంది సాగు చేసే రైతులకు ఉచితంగా కంది విత్తనాలు ఇచ్చేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. మాగాణి రైతులు పొలం గట్లపై మెట్ట భూములు కలిగిన రైతులు కంది సాగు చేపట్టాలని సూచించారు. పేద ప్రజలు ఇబ్బందుల పాలు కాకుండా చూడటమే ప్రభుత్వ లక్ష్యమని, నిబంధనలకు వ్యతిరేకంగా నిత్యవసర ధరలను పెంచి అమ్మకాలు జరిపితే చర్యలు తీసుకుంటామని జిల్లా జాయింట్ కలెక్టర్ ఏ. శ్యామ్ ప్రసాద్ అన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ రమణ నాయక్, ఉమ్మడి జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షులు ఊరా భాస్కరరావు, డాల్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షులు వై.ఎల్ కాంతారావు, ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు కొత్తూరి కిషోర్ బాబు, మార్కెటింగ్ శాఖ అధికారి సూర్య ప్రకాష్ పాల్గొన్నారు.

ప్రజాశక్తి-మాచర్ల

దాల్ , రైస్ మిల్లర్స్ అసోసియేషన్ సేవలు అభినంద నీయమని ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే పిన్నెల్లి. సాధారణ మార్కెట్లో ధరల అధికంగా ఉన్నప్పుడు మిల్లర్స్ అసోసియేషన్ స్పందించి తక్కువ ధరకు పేదలకు కందిపప్పు బియ్యం అందించేందుకు ముందుకు రావడం అభినందనీయమనిఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అన్నారు స్థానిక కోదండ రామాలయంలో శనివారం దాల్ మిల్లర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కందిపప్పు ,బియ్యం కౌంటర్ ను ఆయన ప్రారంభించారు. తెల్ల కార్డు దారులు సబ్సిడీ ధరపై మిల్లర్ల అందించే ఈ సరుకులను కొనుగోలు చేసి లబ్ధి పొందాలని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో మిల్లర్ అసోసియేషన్ నాయకులు బ్రహ్మా రావు మున్సిపల్ చైర్మన్ తురక కిషోర్ కమిషనర్ రమణబాబు వైసిపి నాయకులు సీనియర్ న్యాయవాది శ్రీనివాస శర్మ తదితరులు పాల్గొన్నారు



సత్తెనపల్లిలో బియ్యం,కందిపప్పు విక్రయ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మంత్రి అంబటి రాంబాబు



నరసరావుపేటలో ప్రారంభిస్తున్న జాయింట్ కలెక్టర్ శ్యామ్ ప్రసాద్, ఎమ్మెల్యే శ్రీనివాసరెడ్డి



మాచర్లలో ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి

'అగ్ని పథ్' ఆర్మీ ర్యాలీని విజయవంతం చేయాలి

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా.

పల్నాడు జిల్లాలో అగ్ని పథ్ ఆర్మీ ర్యాలీని అందరి సహకారంతో విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ శివ శంకర్ లోతేటి సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ లోని ఎస్ ఆర్ శంకరన్ వీడియో కాన్ఫరెన్స్ హాలులో శుక్రవారం సంబంధిత జిల్లా అధికారులు, ఆర్మీ అధికారులతో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. అగ్నిపథ్ ఆర్మీ ర్యాలీ నిర్వహణ, ఉద్యోగాల ఎంపికపై కసరత్తు చేపట్టాలని సంబంధిత శాఖల అధికారులకు సూచనలు జారీ చేశారు. ర్యాలీ నిర్వహణ సమయానికి జిల్లా స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలో జిల్లా వ్యాప్తంగా తరలివచ్చే పురుష యువత కోసం మౌలిక వసతులు కల్పన పగడ్బందీగా చేపట్టాలన్నారు. జిల్లాలో పెద్ద ఎత్తున నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశం కల్పించాలని కేంద్రం అగ్నిపద్ పథకాన్ని ప్రవేశ పెట్టిందని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో డిఆర్వో కె. వినాయకం, తదితరులు పాల్గొన్నారు. నరసరావుపేట పట్టణంలోని సత్తెనపల్లి రోడ్డులో ఉన్న జిల్లా క్రీడా ప్రాంగణంలో (డి.ఎస్. ఏ) ఆర్మీ రిక్రూట్ మెంట్ ర్యాలీ కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లను ఆర్మీ రిక్రూట్ మెంట్ అధికారులతో కలిసి జిల్లా జాయింట్ కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ పరిశీలించారు. కార్యక్రమంలో ఆర్మీ రిక్రూట్ మెంట్ అధికారులు, పలువురు జిల్లా అధికారులు, నరసరావుపేట రెవెన్యూ డివిజన్ అధికారి శేషిరెడ్డి, తహశీల్దార్ రమణా నాయక్, మున్సిపల్ డి.ఈ ఓ.శ్రీనివాసరావు , స్టేడి యం అధికారులు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో జిల్లా కలెక్టర్, ఎస్పీ

సిఎంఆర్‌టిగా మార్పు చేయడంపై హర్షం

ప్రజాశక్తి-మాచర్ల: విద్యాశాఖలో సమగ్ర శిక్షణ నందు పని చేస్తున్న సిఆర్పిలను గుర్తించి సిఎంఆర్‌టిగా మార్పు చేసినందుకు సిఆర్పి పల్నాడు జిల్లా సంఘం అధ్యక్షులు వై సాంబ శివరావు హర్షం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత సమగ్ర శిక్షణ నందు విద్యాశాఖలో గత 12 సంవత్సరాల నుండి పని చేస్తున్న, తమను తమ విద్యా అర్హతలు బీఈడీ, టెట్ కలిగి ఉన్నందును తమను సింగల్ స్కూలు ఉపాధ్యాయులు సెలవు పెట్టిన సమయంలో ఆ పాఠశాలలో విద్యార్థులకు బోధన చేసే అవకాశం కల్పించగలరని, మిగిలిన సమయంలో పాఠశాలలు సందర్శన చేయాలని తెలియజేస్తూ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి ఏపీ సీఆర్పీ డబ్ల్యూఏ రాష్ట్ర సంఘం ఆధ్వర్యంలో కలిసి కృతజ్ఞతలు తెలియజేస్తామని తెలిపారు. అదేవిధంగా దీనికి సహకరించిన ఏపీ జిఈఈ అధ్యక్షులు కాకర్ల వెంకటరామ రెడ్డికి, విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, ప్రిన్సిపల్ సెక్రెటరీ ప్రవీణ్ ప్రకాష్ కు సిఆర్పిల తరపున కృతజ్ఞతలు తెలిపారు.

కృష్ణ ప్రసాద్ సేవలు అభినందనీయం

ప్రజాశక్తి-మాచర్ల: ఎక్కడో విదేశాలలో స్థిరపడి పుట్టిన ఊరుని మర్చిపోకుండా తమ తల్లిదండ్రుల జ్ఞాపకార్థం మాచర్ల లో సేవా కార్యక్రమాలు చేస్తున్న ఎన్నారై ఉన్నం వెంకట కృష్ణ ప్రసాద్ సేవలుఅభినందనీయమని వివేకానంద సేవా సమితి అధ్యక్షులు మెట్టు గోవిందరెడ్డి అన్నారు. కృష్ణ ప్రసాద్ తన తల్లిదండ్రులు ఉన్నం సత్యనారాయణ, నారాయణమ్మ ల జ్ఞాపకార్థం, ప్రభుత్వ వైద్యశాలలో , మానసిక వికలాంగుల పాఠశాలలో, ఆత్మ కూరు వృద్ధా శ్రమంలో, పట్టణంలోని అనాథలకు , యాచ కులకు ,వేల రూపాయల ఖర్చుతో అన్నదానం చేయడం అభినందనీయమని, విదేశాల్లో ఉన్నప్పటికీ ఇక్కడి ఈ కార్యక్రమం నిర్వహించడం హర్షణీయమన్నారు.

ప్రజల ముంగిట అధికార యంత్రాంగం

ప్రజాశక్తి-సత్తెనపల్లి టౌన్

ప్రజల అవసరాలు తెలుసుకొని వాటినీ తీర్చేందుకు జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి జగన్ ఏర్పాటు చేశారని రాష్ట్ర మంత్రి అంబటి రాంబాబు అన్నారు . శనివారం ఆయన పట్టణంలోని 8వ సచివాలయం పరిధిలో 25 , 26 వార్డుల ప్రజలకు ఏర్పాటు చేసిన జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా ధ్రువీకరణ పత్రాల పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు ఈ సందర్భంగా వార్డు ప్రజలకు పూర్తి అయిన పలు రకాల ధ్రువపత్రాలను ప్రజలకు అందించారు.



నర్సరీ చట్టం నిబంధనలు పాటించాలి

ప్రజాశక్తి-నూజెండ్ల

నర్సరీ యజమానులు నర్సరీ చట్టం నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని ఉద్యాన శాఖాధికారి షేక్. నబి రసూల్ అన్నారు. నూజండ్ల మండలంలోని యోగిరెడ్డి పాలెం మరియు తంగిరాల పరిధిలో ఉన్న షెడ్ నెట్ నర్సరీలను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నర్సరీ నిర్వాహకులు నర్సరీ చట్టం 2010 ప్రకారం నర్సరీ లైసెన్స్ మరియు రిజిస్ట్రేషన్ కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. నర్సరీ లైసెన్స్ కోసం షెడ్ నెట్ చుట్టూ 9 నుంచి 14 అడుగుల ఎత్తు వరకు ఇన్సెక్ట్ ప్రూఫ్ నెట్టుతో రక్షణ కల్పించాలన్నారు. షెడ్ నెట్ హౌస్ లో డబుల్ డోర్ సిస్టం కలిగి ఉండాలన్నారు. షెడ్ నెట్ హౌస్ లో పైన ఉన్న నెట్ కు గాని ఇన్సెక్ట్ నెట్ కు గాని కీటకాలు లోపల ప్రవేశించకుండా ఉండుటకు నెట్ కు ఎక్కడ కూడా రంధ్రాలు లేకుండా చూసుకోవాలన్నారు.

విద్యుత్ తీగలు సరిచేయండి

సర్వసభ్య సమావేశంలో బండారుపల్లి సర్పంచ్

ప్రజాశక్తి-తాడికొండ

బండారుపల్లి గ్రామంలో అన్ని రహదారుల వెంట ఉన్న కరెంటు స్తంభాలు వంగిపోయి ప్రమాద భరితంగా మారాయని అధికారులకు విన్నవించుకున్నా పట్టించుకోవడం లేదని ఆ గ్రామ సర్పంచ్ ముప్పాళ్ళ మనోహర్ విద్యుత్ ఏఈ రవికుమార్ ను ప్రశ్నించారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మనోహర్ తమ గ్రామంలో ఎటు చూసినా తీగలు వంగిపోయి ఉన్నాయని లైన్మెన్ గ్రామంలో ఉండటం లేదని ఏదైనా సమస్యవస్తే ఎవరిని సంప్రదించాలని, తమ సమస్యలు ఎవరికి చెప్పుకోవాలని ఆక్రోసం వెళ్లగెక్కారు. గ్రామ అవసరాలను దృష్టిలో పెట్టుకొని రహదారుల ఎత్తును పెంచడం జరిగిందన్నారు. నిత్యం విద్యుత్ తీగలు వేలాడుతున్నాయని ఇటీవల తీగల తగిలి ఒక యువకునికి గాయాలు అయ్యాయని అయినా ఎందుకు పట్టించుకోవటం లేదని ప్రశ్నించారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా ఉంటే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. స్పందించిన ఏఈ గ్రామంపై సమస్యలు లేకుండా చర్యలు చేపడతామని బదులిచ్చారు. లచ్చన్నగుడిపూడి గ్రామంలో ప్రభుత్వ భవనాల నిర్మాణం పూర్తయినా తమకు అప్పగించడంలో జాప్యం జరుగుతుందని గ్రామ సర్పంచ్ గునుగునూరి



మాట్లాడుతున్న కత్తెర సురేష్ కుమార్

అలివేలమ్మ ప్రశ్నించారు,రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పలు అభివద్ధి సంక్షేమ పథకాలు గురించి వైసీపీ నియోజకవర్గ సమన్వయకర్త కత్తెర సురేష్ కుమార్ మాట్లాడారు. కార్యక్రమంలో జడ్పిటిసి గుడిమెట్ల జ్యోతి ఎంపీపీ తాళ్ల భాగ్యలక్ష్మి శివ నాగరాజు వైస్ ఎంపీపీ రెడ్డి త్రివేణి ఎంపీడీవో అత్తోట దీప్తి డిప్యూటీ తహసీల్దార్కే ప్రసాద్ వివిధ శాకాధికారులు,పంచాయతీ కార్యదర్శులు సర్పం చులు ఎంపిటీసీలు పాల్గొన్నారు



షాదీఖానా నిర్మాణ ఏర్పాట్ల పర్యవేక్షణ

ప్రజాశక్తి - చేబ్రోలు

మండలంలోని వడ్లమూడిలో నూతనంగా నిర్మిస్తున్న షాదీఖానా ఏర్పాట్లను పర్యవేక్షించిన వై ఎస్ ఆర్ సి పి రాష్ట్ర అధికార ప్రతినిధి, ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య శనివారం పర్యవేక్షించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ నెలలోపే ఈ షాదీ ఖానాను ప్రారంభించనున్నట్లు చెప్పారు. సుదీర్ఘ కాలముగా ఈ ప్రాంత పేద ప్రజల ఆకాంక్ష నెరవే ీనుండటంతో వారు సంతోషంగా ఉన్నారని అన్నారు. వేజెండ్ల సొసైటీ అధ్యక్షులు చందు సాంబశివరావు, జిడిసిఎంఎస్ డైరెక్టర్ కుర్రపాములు, మన్నెం వేణుగోపాలరావు, పోతురాజు పాల్గొన్నారు.

'టిడిపి హయాంలో అభివృద్ధి జరగలేదనడం అబద్ధం'

ప్రజాశక్తి-పొన్నూరు రూరల్

పొన్నూరు పట్టణానికి మాజీ ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ ఎటువంటి అభివృద్ధి చేయలేదని తాను వచ్చిన నాలుగేళ్ల లోనే ఎంతో అభివృద్ధి చేశానని ఎమ్మెల్యే కిలారి రోశయ్య చేసిన వ్యాఖ్యలపై జిల్లా టిడిపి అధికార ప్రతినిధి తానికొండ లక్ష్మీనారాయణ చౌదరి విమర్శలు గుప్పించారు. శనివారం స్థానిక టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నరేంద్ర కుమార్ పొన్నూరు పట్టణంలో చేసిన అభివృద్ధిని తెలుసుకుని రోశయ్య మాట్లాడాలని అన్నారు. ఈ సందర్భంగా నరేంద్ర హయాంలో జరిగిన అభివృద్ధి పనులను ప్రస్తావించారు.



చిర్రావూరులో స్వచ్ఛభారత్

ప్రజాశక్తి-తాడేపల్లి రూరల్

స్వచ్ఛ పరిసరాల కోసం ప్రజలంతా బాధ్యతాగా కషిచేయాలని కెఎల్ డీమ్డ్ యూనివర్శిటీ ఎన్ఎస్ఎస్ ఇంచార్జి, అధ్యాపకులు శ్రీకాంత్ రెడ్డి అన్నారు. శనివారం ఎంటిఎంసీ పరిధిలోని చిర్రావూరులో ఎన్ ఎస్ఎస్ విబాగం అద్వర్యంలో వ్యవసాయ విబాగానికి చెందిన విద్యార్థులు స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. అందులో భాగంగా చీపుర్లతో ఆ ప్రదేశంలో పారిశుధ్య పనులను నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విధ్యార్థులు, గ్రామస్తులు స్వచ్ఛ సర్వేక్షణ్ పట్ల అవగాహన పెంచుకోవాలని కోరారు. పరిశుభ్రమైన పరిసరాలే ప్రజా ఆరోగ్యానికి వారధి అని అన్నారు. గ్రామ పంచాయితీలు, మునిసిపాలిటీల్లో ఇంటింటికీ అందజేసిన చెత్త డబ్బాలను ప్రజలు ఉపయోగించాలన్నారు. తడి చెత్తను, పొడి చెత్తను విడి విడి గా చేయాలని ఆయన సూచించారు. కెఎల్ విశ్వవిద్యాలయం దత్తత తీసుకున్న గ్రామాలు పచ్చదనంతో పరిశుభ్రంగా ఉండే విదంగా కార్యాచరణ చేపట్టినట్లు పేర్కొన్నారు

'చలో గుంటూరు' విజయవంతం చేయండి

ప్రజాశక్తి-దుగ్గిరాల

ఈ నెల 18వ తేదీన చలో గుంటూరు కార్యక్రమాన్ని ఆశ వర్కర్లు విజయవంతం చేయాలని సిఐటియు మండల కార్యదర్శి జెట్టి బాలరాజు కోరారు. ఈ మేరకు స్థానిక పిహెచ్సిలో జరిగిన ఒక కార్యక్రమంలో వైద్యాధికారిని ఇందిరా రాణికి అర్జీని ఇచ్చారు . ఆశా వర్కర్లకు 10 లక్షల గ్రూప్ గ్రూప్ ఇన్సూరెన్స్ చేయించాలని, వెయ్యి మంది జనాభా పరిధిలో పనిచేయవలసి ఉండగా మూడువేల మంది పరిధిలో పనిచేయమని ఆదేశాల ఇవ్వడం సబబు కాదని అన్నారు. నాణ్యమైన ఫోన్లు లేక ఆన్లైన్ లో పని చేయటానికి ఆశా వర్కర్లు ఇబ్బంది పడుతున్నారని



వైద్యాధికారిణికి అర్జి ఇస్తున్న చిత్రం

4జి సిమ్‌తో పాటు నాణ్యమైన ఫోన్లు అందజేయాలని కోరారు. కార్యక్రమంలో టి సునీత విమల మాలతి వెంకటేశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

బి ఫార్మసీ ఫలితాల్లో సత్తా చాటిన 'ఎఎస్ఎన్'విద్యార్థులు

ప్రజాశక్తి-తెనాలి

ఆచార్య నాగార్జున విశ్వ విద్యాలయం శనివారం విడుదల చేసిన బి ఫార్మసీ ఫలితాల్లో బుర్రిపాలెం రోడ్డులో ఉన్న ఏఎస్ఎన్ ఫార్మసీ కళాశాల విద్యార్థులు సత్తా చాటారు. ప్రిన్సిపల్ డాక్టర్ కె.వెంకటరమణ వెల్లడించిన



వివరాల ప్రకారం నూరుశాతం ఫలితాలు సాధించామని, విద్యార్థులు సాయి లక్ష్మీ గాయత్రి 9.5 జిపిఎ, తిరుపతమ్మ 9 జిపిఏతో సత్తా చాటారన్నారు. వారిని అభినందించారు.

విచ్చలవిడిగా సమస్యాత్మక క్యారీ బ్యాగుల వినియోగం

ప్రజాశక్తి-మంగళగిరి

పర్యావరణ పరిరక్షణకు సమస్యాత్మక క్యారీ బ్యాగులను వినియోగించవద్దనే నిబంధన ఉంది. ఇందుకోసం మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని చిరు వ్యాపారం నుండి పెద్ద వ్యాపార దుకాణాల వరకు కార్పొరేషన్ అధికారులు ఇప్పటికే అనేకసార్లు ఆదేశాలు కూడా జారీ చేశారు. పర్యావరణానికి హాని కలిగించని జ్యుటు బ్యాగులను మాత్రమే వినియోగించాలని సూచించారు. అయినప్పటికీ వ్యాపారులకు అధికారుల ఆదేశాలు పెద్దగా చెవికెక్కినట్లు కనిపించడం లేదు. నగరంలోని మెయిన్ బజార్ లో గాలిగోపురం వద్ద నుండి సీతారామ కోవెల వరకు అనేకచోట్ల దుకాణాల్లో,హెూటళ్లలో సమస్యాత్మక క్యారీ బ్యాగులను అందుబాటులో ఉంచి వినియోగిస్తు న్నారు. అదేమిటంటే జనం అడుగుతున్నారని తయారీ నిషేధించాలని సాకులు చెబుతున్నారు.

ఇలా అయితే పర్యావరణ పరిరక్షణ సాధ్యమేనా అన్న సందేహాలు కలగక మానదు. రాష్ట్ర ప్రభుత్వం కూడా క్లాత్ బ్యాన ర్లను తీసుకొచ్చిన చందంగా సమస్యాత్మక క్యారీ బ్యాగులను విక్రయించిన వినియోగించిన వారిపై చర్యలు తీసుకునేలా చట్టం తీసుకురావాలని పర్యా వరణ ప్రేమికుడు కోరుతున్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

ప్రజాశక్తి-మంగళగిరి

అర్హులైన ప్రతిఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించడమే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రతిష్టాత్మకంగా జగనన్న సురక్ష కార్యక్రమాన్ని చేపట్టారని ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు అన్నారు. శనివారం నగరంలోని మార్కండేయ కళ్యాణ మండపంలో వీవర్స్ కాలనీ 5వ సచివాలయం, బాప్టిస్ట్ పేట 9వ సచివాలయం పరిధిలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవి ముఖ్య అతిథులుగా హాజరై పలువురు లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలను అందజేశారు.

ప్రజాశక్తి-తెనాలి

పట్టణంలోని 15, 16 వార్డులకు సంబంధించి స్థానిక అంబేద్కర్ కళాశాలలో శనివారం జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ పాల్గొన్నారు.

ప్రజాశక్తి-పెదనందిపాడు

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా పుసులూరు గ్రామంలో జగనన్న సురక్ష క్యాంపెయిన్ నిర్వహించారు.

ప్రజాశక్తి-ఫిరంగిపురం

గ్రామ సచివాలయం 1, గుండాల పాడు గ్రామాలలో జగనన్న సురక్ష కార్యక్రమం జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త కత్తెర సురేష్ కుమార్ మాట్లాడారు. దళితులకు అసైన్డ్ భూములు భూమిపై తీసుకున్న రుణాలు మాఫీ సం పూర్ణ భూహక్కు పత్రాలు 22 ఏ లో ఉన్న భూములకు విముక్తి చేసే కార్యక్రమం తలపెట్టిన జగన్‌కు పాలాభిషేకం చేశారు



కోనేరు అభివృద్ధి పనుల పరిశీలన

ప్రజాశక్తి-మంగళగిరి

మంగళగిరి పట్టణంలో ఉన్న పెదకోనేరు అభివృద్ధి పనులు గత కొన్ని నెలలుగా జరుగుతున్నాయి. ఈ పనులు పరిశీలనకు ఇంటెక్స్ రాష్ట్ర కన్వీనర్ ఎస్ పి ఎస్ లక్ష్మీనారాయణ శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వందల సంవత్సరాల చరిత్ర ఉన్న కోనేరు ను ప్రభుత్వం అభివద్ధి చేయడం మంచి పరిణామం అని అన్నారు. అబివృద్ధి పనులకు సహకరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో ఏ రామకోటిరెడ్డి, రెడ్ క్రాస్ జిల్లా వైస్ చైర్మన్ బి రామచంద్ర రాజు, మంగళగిరి చైర్మన్ ఇసునూరి అనిల్ చక్రవర్తి, సభ్యులు గాజుల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



పార్కుల్లో పిచ్చిమొక్కల తొలగింపు

ప్రజాశక్తి-పొన్నూరు రూరల్

పొన్నూరు పట్టణంలోని విద్యానగర్ అంబేద్కర్ కాలనీ శాంతినగర్ లో సామాజిక పార్కులలో శనివారం పిచ్చి మొక్కలు, ముళ్ళ పదలు వివిధ వ్యర్థాలను తొలగించే కార్యక్రమాన్ని చేపట్టారు పొన్నూరు మున్సిపల్ కమిషనర్ సి యం ఎ నయీామ్ అహ్మద్ పర్యవేక్షణలో శానిటరీ ఇన్స్పెక్టర్ లక్ష్మీప్రసాద్ నేతత్వంలో పారిశుద్ధ్య పనులు చేపట్టారు. పార్కులలో ప్రజలు వ్యర్థాలు వేయకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాల్సిందిగా కమిషనర్ సిబ్బందిని ఆదేశించారు



ఇస్త్రీ బండ్లు పంపిణీ

ప్రజాశక్తి-మంగళగిరి

ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి సహకారంతో శనివారం ముగ్గురు వ్యక్తులకు ఇస్త్రీ బండ్లను ఎమ్మెల్యే ఆర్కే కార్యాలయంలో పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు మునగాల మల్లేశ్వరరావు, సంకే సునీత, ఎం సుధారాణి, బి నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

నూలు వడికే రాట్నాలు పంపిణీ

ప్రజాశక్తి-మంగళగిరి



టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ సహకారంతో చేనేత చేయూత కార్యక్రమంలో భాగంగా శనివారం మూడో విడత చేనేత కార్మికులకు నూలు వడికే రాట్నాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ పి అనురాధ మాట్లాడుతూ నిరుపేదలైన చేనేత కార్మికులకు అండగా ఉండాలని ఆలోచనతో నారా లోకేష్ సహకారం చేస్తున్నారని అన్నారు.

రాయితీ ధరలకు బియ్యం, పప్పులు విక్రయాలు

ప్రజాశక్తి-గుంటూరు


కేంద్రాన్ని ప్రారంభిస్తున్న జెసి

ప్రస్తుతం మార్కెట్‌లో బియ్యం ధరలు అధికంగా పెరిగినందున ప్రభుత్వ ఆదేశాల మేరకు రైతు బజార్లలో ప్రత్యేక కేంద్రాల ద్వారా స్టీమ్ బియ్యం కిలో రూ.44లు, బిపిటి బియ్యం కిలో రూ.48ల చొప్పున అందచేస్తున్నట్లు జిల్లా సంయుక్త కలెక్టర్ జి.రాజకుమారి తెలిపారు. శనివారం స్థానిక చుట్టుగుంట సెంటర్‌లోని రైతు బజారులో బియ్యం విక్రయాలను జేసీ ప్రారంబి ంచారు. బియ్యం గుంటూరు చుట్టుగుంట, ఆర్టీసి బస్టాండ్, తెనాలి నాజర్ పేట, పొన్నూరు రైల్వేషన్ స్టేషన్ రోడ్డు, రైతు బజార్లలో ప్రత్యేక కేంద్రాలు ఉన్నాయని చెప్పారు. అలాగే మినపగుళ్ళు కిలో రూ.101లు, కందిపంప్పు కిలో రూ.135ల చొప్పున రైతు బజార్లలో ప్రత్యేక కేంద్రాల్లో ఈనెల 17వ తేదీ నుండి విక్రయాలు జరుగుతాయన్నారు. మినపగుళ్ల, కందిపప్పు కేంద్రాలు మంగళగిరి యార్డు కాంప్లెక్స్, గంగానమ్మ రైతు బజార్లలో ప్రత్యేక కేంద్రాలుంటాయన్నారు. కావున వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.



టమాటాల కోసం బారులు తీరిన ప్రజలు

ప్రజాశక్తి సత్తెనపల్లి రూరల్ :రాయితీ టమాటాల కోసం ప్రజలు బారులు తీరారు. సత్తెనపల్లి వ్యవసాయ మార్కెట్ యార్డు ప్రాంగణంలోని రైతు బజార్లో రూ.50లకు కిలో టమాటా శనివారం పంపిణీ చేశారు. బహిరంగ మార్కెట్లో కేజీ టమాట రూ.150 ధరకు విక్రయిస్తున్నారు. వీటిని కొనలేని వినియోగదారులు రాయితీ పై టమాటాలు పంపిణి చేస్తుండటంతో బారులు తీరారు. ఒక్కొక్కరి కేజీ టమాటాలు పంపిణీ చేశారు.

భవిష్యత్ కృతిమ మేథదే

ప్రజాశక్తి-గుంటూరు



మాట్లాడుతున్న ప్రొఫెసర్ ఉమపాదపాల్

రాబోయే భవిష్యత్ కాలమంతా కృతిమ మేథ మీదే ఆధారపడి ఉంటుందని ఐఎస్ఐ కోలకతాలోని కంప్యూటర్ సైన్స్ అండ్ ప్యాట్రన్ రికగ్నిషన్ యూనిట్ ప్రొఫెసర్ ఉమపాదపాల్ అన్నారు. వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీలోని స్కూల్ ఆఫ్ కంప్యూటింగ్ అండ్ ఇన్ఫర్మాటిక్స్ విభాగం ఆధ్వర్యంలో 'అప్లికేషన్స్ అండ్ అల్గారిథమ్స్ ఆఫ్ కంప్యూటర్ విజన్ అండ్ ప్యాట్రన్ రికగ్నిషన్' అనే అంశంపై రెండ్రోజుల పాటు నిర్వహించిన ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ శనివారం ముగిసింది. ప్రొఫెసర్ ఉమపాదపాల్ మాట్లాడుతూ మెరుపువేగంతో ముందుకొస్తున్న ఏఐ టెక్నాలజీని అందిపుచ్చుకోవాలన్నారు. నేర్చుకునే యంత్రాలు, నాడీ అనుసంధాన వ్యవస్థలు, సహజ భాషల విభజన, జన్య అల్గారిథమ్‌లు, కంప్యుటేషన్ సజనాత్మకత..ఇలా సాధారణ స్థాయి నుంచి స్వీయ అవగాహన యంత్రాల వరకు కత్రిమ మేధస్సు నిత్యనూతనంగా మారుతూ వస్తుందన్నారు. టాకింగ్‌బోట్, చాట్‌బోట్, ఇమేజ్, ఫేస్ అండ్ ఎమోషన్ రికగ్నిషన్, ఏఐ ఆధారిత గేమ్స్‌కు సంబంధించిన కోడింగ్ నైపుణ్యాలు, వాటి తయారీ విధానంపై అవగాహన కలిగి ఉండాలన్నారు. రాబోయే రోజుల్లో అన్ని రంగాల్లో రోబోటిక్స్ సేవలు అత్యంత కీలకంగా మారనున్నాయని పేర్కొన్నారు. అగ్రికల్చర్, మాన్యుఫ్యాక్చరింగ్, లా అండ్ ఆర్డర్, షిప్పింగ్, స్పేస్ రీసెర్చ్ టెస్టింగ్‌లో రోబోటిక్స్ వినియోగం రోజురోజుకూ పెరుగుతోందన్నారు. జనరల్ మోటార్స్ తదితర కంపెనీలు సెల్ఫ్ డ్రైవింగ్ కార్ల తయారీలను ప్రారంభించాయన్నారు. కత్రిమ మేథ, ఆటోమేషన్ వంటి టెక్నాలజీ ప్రవేశంతో ఉద్యోగాల తీరు మారడంతో పాటు అనేక సవాళ్లు సైతం ఎదురయ్యే అవకాశముందని హెచ్చరించారు. కార్యక్రమంలో విజ్ఞాన్స్ వీసీ ప్రొఫెసర్ పీ.నాగభూషణ్, రిజిస్ట్రార్ డాక్టర్ ఎంఎస్ రఘునాథన్ తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ సర్జరీ వైద్యుల కృషి అద్భుతం

సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్ కుమార్

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి



గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రి ప్లాస్టిక్ సర్జరీ వైద్యులు అద్భుతాలు చేస్తున్నారని సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్ కుమార్ తెలిపారు. శనివారం ప్రపంచ ప్లాస్టిక్ సర్జరీ దినోత్సవం సందర్బంగా జిజిహెచ్ ప్లాస్టిక్ సర్జరీ విభాగం ఆధ్వర్యంలో డాక్టర్ కిరణ్ కుమార్ రోగులకు పండ్లు అందచేశారు. అనంతరం సుశత హాలులో జరిగిన కార్యక్రమం లో డాక్టర్ కిరణ్ కుమార్ మాట్లాడుతూ చేయి, కాలు అవయవాలను సరి చేసేందుకు ప్లాస్టిక్ సర్జరీ విభాగం ఎంతో కీలకమైందని అన్నారు. ప్రమాదం జరిగి ఆరు గంటల ల్లో ఆసుపత్రి కి వస్తే అవయవాలను సరి చేసేందుకు వీలు కలుగుతుందని ఆయన చెప్పారు. రానున్న రోజుల్లో క్యాజువాల్టిని అనేక మార్పులు తీసుకుని వస్తున్నామని ఆయన వివరించారు. క్యాజువాల్టి లో ప్లాస్టిక్ సర్జరీ విభాగానికి ప్రాధాన్యత కల్పిస్తామని ఆయన తెలిపారు. ప్లాస్టిక్ సర్జరీ వైద్యులు రోగులకు మరింతగా సేవలు అందించాలని ఆయన కోరారు. శుక్రవారం ప్లాస్టిక్ సర్జరీ విభాగం లో ఆపరేషన్ లు చేసిన రోగులను డాక్టర్ కిరణ్ కుమార్ పలకరించారు. ఈ కార్యక్రమం లో డాక్టర్ సుమిత శంకర్,అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ గంగా భవాని, డాక్టర్ నజ్మా, డాక్టర్ చంద్ర లేఖ, ఎస్ ఆర్ డాక్టర్ నిషాంత్ లు పాల్గొన్నారు.

రాజ్యాంగ స్వరూపాన్ని మార్చే హక్కు పార్లమెంట్‌కు లేదు

- ఐలు గుంటూరు జిల్లా మహాసభలో ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు

ప్రజాశక్తి - గుంటూరు లీగల్



మాట్లాడుతున్న కెఎస్ లక్ష్మణరావు

ఆలిండియా లాయర్స్ అసోసియేషన్ (ఐలు) 12జిల్లా మహాసభ శనివారం గుంటూరు గుర్రం జాషువా విజ్ఞాన కేంద్రంలో నిర్వహంచారు. మాహాసభకు జిల్లా అధ్యక్షులు డాక్టర్ సయ్యద్ బాబు అధ్యక్షత వహంచారు. జిల్లా నలుమూల నుండి హాజరైన న్యాయవాదులను ఉద్దేశించి ముఖ్యఅతిధిగా హాజరైన ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు భారత రాజ్యాంగ పరిరక్షణ - ఆవశ్యకత అంశంపై మాట్లాడారు. రాజ్యాంగ మౌళిక స్వరూపాన్ని మార్చే హక్కు పార్లమెంట్‌కు లేదని కేశవానంద భారతి కేసు ద్వారా చెప్పడం జరిగిందన్నారు. బిన్నత్వంలో ఏకత్వంగా ఉన్న మన దేశాన్ని బిజెపి కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వాల హక్కులను కాలరాస్తుందని తెలిపారు. ప్రజలకు వ్యతిరేకంగా ఉన్న చట్టాలను ప్రజలే వ్యతిరేకించాలన్నారు.ఉపా చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం తన స్వార్థం కోసం వినియోగించు కుంటూ సామాజిక ఉద్యమకారులపై తప్పుడు కేసులు బనాయిస్తూ, పౌరుల గొంతు నొక్కుతుందని, జైళ్లపాలు చేస్తుందన్నారు. న్యాయవాదులందరూ న్యాయం, లౌకికవాదం, ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని తద్వార రాజ్యంగాన్ని కాపాడినవారు అవుతారని తెలిపారు. ఐలు రాష్ట్ర కార్యదర్శి నర్రా శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రసుతం ఉన్న పరిస్థితి, రాజ్యాంగం, ఎదుర్కొంటున్న సవాళ్లు వాటిని మనం ఎలా ఎదుర్కోవాలి, మన బాధ్యత ఏమిటి అనేది తెలుసుకోవాలన్నారు. రాజ్యాంగంలో ఉన్న ప్రజాస్వామ్యం, సమన్యాయం, సోషలిజం, సెక్యులరిజంలను వివరించి చెప్పారు. సిహెచ్ఎల్ఎన్.మూర్తి మాట్లాడుతూ రాజ్యాంగం మీద ప్రాథమిక అవగాహన కల్పిం చారు. ప్రజలంతా చైతన్యవంతులై ఎదుర్కొన్న పుడే ఫాసిజం నసిస్తుందన్నారు. సెమినార్‌లో మహిళా నాయకులు దాసరి ఉదయశ్రీ, జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్, నగర అధ్యక్ష, కార్యదర్శులు జి.శేషగిరిరావు, ప్రత్యుష, వివిధ లా కళాలల నుండి విద్యార్థులు పాల్గొన్నారు.

ఐలు నూతన జిల్లా కమిటీ ఎన్నిక


డాక్టర్ సయ్యద్‌బాబు


బి లీలా కృష్ణ

మహాసభల్లో ఐలు జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా గౌర వాధ్యక్షులుగా సిహెచ్ఎల్ఎం మూర్తి, అధ్యక్షు లుగా డాక్టర్ సయ్యద్‌బాబు, ప్రధాన కార్య దర్శిగా భీమినేని లీలాకృష్ణ, ఉపాధ్యక్షులుగా గండికోట శేషగిరిరావు, దాసరి ఉదయశ్రీ, తదితరులతో కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు.

రాజీఫార్ములాతో మొక్కుబడిగా డిఆర్‌సి...

వీక్షణం

జిల్లాలో నెలకొన్న అనేక సమస్యలపై చర్చించేందుకు కీలక వేదికగా ఉన్న జిల్లా సమీక్షా సమావేశం (డిఆర్‌సి) కీలక అంశాలు చర్చకు నోచుకోలేదు. పలువురు ప్రజా ప్రతినిధులు కూడా సమావేశానికి హాజరు కాకపోవడం చర్చనీయాంశంగా మారింది. ఉమ్మడి జిల్లాలో మొత్తం ఎనిమిది మంది ఎమ్మెల్సీలు ఉండగా ఐదుగురు, ఏడుగురు ఎమ్మెల్యేలు ఉండగా నల్గురు, ఇద్దరు ఎంపిలకుగాను ఒక్కరూ హాజరు కాలేదు. హాజరు అయిన ప్రజా ప్రతినిధుల్లో ఎమ్మెల్సీలు ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు, కెఎస్ లక్ష్మణరావు, చంద్రగిరి ఏసురత్నం, మురుగుడు హనుమంతరావు, కల్పలత సమస్యలను ప్రస్తావించారు. కెఎస్ లక్ష్మణరావు ఎజెండాలోని ప్రతి అంశంపైన జరిగిన చర్చలో పాల్గొన్నారు. పలు అంశాలు ప్రస్తావించి జిల్లా కలెక్టర్, ఇన్‌ఛార్జిమంత్రి ధర్మాన ప్రసాదరావు నుంచి సమాధానాలు రాబట్టారు. హామీలు పొందారు. మిగతా వారు పలు అంశాలపై జరిగిన చర్చల్లో మాట్లాడారు. అలాగే ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి మంగళగిరి నియోజకవర్గంలో నెలకొన్న అనేక అంశాలను ప్రస్తావించారు. ప్రతి అంశంలో ఆయన కూడా చర్చలో పాల్గొన్నారు. గతంలో ప్రభుత్వంపై అధికార పార్టీ నేతలే విమర్శలు చేస్తున్నారని ఇక మీదట అలా చేయకూడదని అధినాయకత్వం నుంచి వచ్చిన ఆదేశాలతో వైసిపి ప్రజా ప్రతినిధులు ఆచితూచి మాట్లాడారు. రాజీ ధోరణిలో కొంత మంది, విజ్ఞాపన పద్ధతిలో మరికొంత మంది మాట్లాడారు. గుంటూరు ఛానల్ విస్తరణ, పొడిగింపుపై దాదాపు 15 రోజులుగా పత్తిపాడు నియోజకవర్గం రైతులు కలెక్టరేట్ వద్ద దీక్షలు చేస్తున్నా జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి ధర్మాన ప్రసాదరావు దీక్షా శిబిరం సందర్శించి వారి గోడు వినలేదు. గుంటూరు ఛానల్ విస్తరణ పనులపై ఎమ్మెల్సీ లక్ష్మణరావు, మురుగుడు హనుమంతరావు, ఎమ్మెల్యే ఆర్.కె.ప్రముఖంగా మాట్లాడారు. కానీ నిధులు ఎప్పటికి వస్తాయి... పనులు ఎప్పుడు ప్రారంభిస్తారనే అంశంపై మంత్రి ధర్మాన ప్రకటన చేయలేదు. ప్రభుత్వం ప్రాధాన్యతలో ఛానల్‌పనులు ఉన్నాయని మాత్రమే చెప్పారు. సమావేశంలో ఏజెండాలో పేర్కొన్న 8 అంశాలపైనే చర్చజరిగింది. వ్యవసాయంకు సంబంధించి ఈఏడాది వర్షాభావం, కృష్ణాబేసిన్ పొంచి ఉన్ననీటి ఎద్దడిపై కనీస చర్చ జరగలేదు. జిల్లాలో అధ్వాన రహదారులు, సాంఘీక సంక్షేమ వసతి గృహాల్లో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలు, నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదల పై కూడా చర్చించలేదు. గుంటూరులో కలెక్టరేట్‌లో జరిగిన ఈ సమావేశానికి ఎమ్మెల్యే మద్దాలి గిరి, మేయర్ కావటి మనోహర్ నాయుడు, ఎమ్మెల్సీ అప్పిరెడ్డి హాజరు కాలేదు. డిఆర్‌సి సమావేశాలకు టిడిపి నుంచి ఎంపి గల్లా జయదేవ్ ఒక్క సమావేశానికి రాలేదు. ఇటీవల ఎమ్మెల్సీగా గెలుపొందిన పంచుమర్తి అనూరాధ కూడా తొలి సమావేశానికి హాజరు కాలేదు. విశేషమేంటే ప్రజల చేత ఎన్నికయిన ప్రజా ప్రతినిధులు కొంత మంది గైర్హాజరు కాగా ఏపదవిలేని, ప్రజా ప్రతినిధి కాని ఎమ్మెల్యే ముస్తాఫా కుమార్తె షేక్ నూరిఫాతిమా సమావేశంలో కన్పించారు. ఆమెను బయటకు పొమ్మనలేక అధికారులు తీవ్ర ఇబ్బందిపడ్డారు. చివరలో ఎమ్మెల్యే ముస్తాఫా సమావేశానికి హాజరు అయ్యారు. ఇదిలా ఉండగా గతంలో జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి అభివృద్ధి సంక్షేమ పథకాల అమలుతోపాటు అధికార పార్టీ వ్యవహారాల్లోనూ కీలకంగా ఉండేవారు.తరచూ జిల్లాలో పర్యటించేవారు. కానీ ధర్మాన ప్రసాదరావు గతేడాది కాలంగా డిఆర్‌సి సమావేశాలకే పరిమితం అవుతుండటం గమనార్హం.

(ఎవిడి శర్మ)

విలీన గ్రామాలు, శివారు ప్రాంతాల్లో ..

విద్యుత్ సమస్యలు పరిష్కరించాలి : మేయర్

ప్రజాశక్తి-గుంటూరు


సిఎండితో సమావేశం అయిన మేయర్

గుంటూరు నగరంలోని శివారు కాలనీలలో, విలీన గ్రామాల్లో విద్యుత్ సరఫరాలో ఎటువంటి అంతరాయాలు లేకుండా చర్యలు తీసుకోవాలని గుంటూరు నగర పాలక సంస్థ మేయర్ కావటి శివ నాగ మనోహర్ నాయుడు ఆంధ్రప్రదేశ్ సెంట్రల్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఏ.పి.సి.పి.డి.సి.యల్) సి.యం.డిని కోరారు. శనివారం స్థానిక పొన్నూరు రోడ్డులోని ఏ.పి.సి.పి.డి.సి.యల్ కార్యాలయంలో చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ జె.పద్మజనార్ధనరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి శాలువా, బోకేతో సన్మానించి, నగరంలో విద్యుత్ సమస్యలకు చేపట్టాల్సిన చర్యలపై చర్చించారు. గుంటూరు నగరంలో శివారు కాలనీలలో , విలీన గ్రామాల్లో లో వోల్టేజ్, విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని తెలియచేశారు. సదరు ప్రాంతాల్లో విద్యుత్ సమస్యలను అధిగమించడానికి అదనపు ట్రాన్స్‌ఫార్మర్లు, సబ్ స్టేషన్ల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలన్నారు. ఆయా ప్రాంతాల్లో పేద ప్రజలు ఎక్కువగా నివాసం ఉంటారని, కావున కరెంట్ కోతలు లేకుండా అదనపు పోల్స్, నూతనంగా కరెంట్ లైన్లు ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని మేయర్ కోరారు. ఈ సందర్భంగా సి.యం.డి స్పందిస్తూ సమస్యల పరిష్కారానికి అధికారులతో చర్చించి చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో ఏ.పి.సి.పి.డి.సి.యల్ టేక్నికల్ డైరెక్టర్ జయభారత రావు, యస్.ఈ మురళీకష్ణ, ఈఈ టి. శ్రీనివాస్‌బాబు తదితరులు పాల్గొన్నారు.